అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును. సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

సంపుటి : 17 సంచిక : 201 | 30-08-2025 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## సిఎంను కలిసిన
# ఓవైసీ బ్రదర్స్



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ,మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ- సభ్యులు శక్రవారం ఆయన నివాసంలో కలిశారు. మిలాదున్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలం కరించాలని, ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14 న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు.



# సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

## నూతన జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్

జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ శుక్రవారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తి స్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది.

వార్త 2లో

# కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

### అనుమతి కోరుతూ స్పీకర్‌కు బిఆర్ఎస్ వినతిపత్రం



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బీఆర్ఎస్ఎల్పీకి కల్పించాలని స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# తీరనున్న యూరియా కష్టాలు

ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



వార్త 2లో

## జిఎస్టీ రేట్ రేషనైలేజేషన్‌తో
# రెవెన్యూపై ప్రభావం



- రాష్ట్రాలు బలపడితేనే..దేశం పటిష్టంగా ఉంటుంది
- జిఎస్టీ నష్టాలకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూడాలి
- తెలంగాణ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క డిమాండ్

రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ-సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జిఎస్టి రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే.. దేశం బాగుం టుందని తెలియజేశారు.

వార్త 2లో



# లంబాడీ, సుగాలీ, బంజారాలు ఎస్టీలు కాదు

## వారిని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్ విచారణ చేపట్టిన సుప్రీం...కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది.

వార్త 2లో

## సత్యం-అహింస ముందు
# అసత్యం-హింస నిలబడలేవు: రాహుల్ గాంధీ



హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

బీహార్ లోని కాంగ్రెస్ శ్రేణులపై బీజేపీ దాడిపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. సత్యం-అహింస అంతిమ విజయం సాధిసా_ యని, వాటి ముందు అసత్యం,హింస నిలబడ లేవని ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. దాడులు మా యాత్రను అడ్డుకోని నిలుపుదల చేయ లేవని, నిజాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి తమ పోరాటం కొనసాగుతుందని, సత్యమే జయతే అంటూ పోస్టు చేశారు.కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోడీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఇవాళ బీజేపీ ర్యాలీ చేపట్టింది. పాట్నాలోని కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ దుశ్చర్యను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులపై బీజేపీ నాయకులు జెండా కర్రలతో దాడి చేశారు.



వివరాలు 2లో..

# హైదరాబాద్‌లో నిమజ్జన సందడి

## ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

## స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతున్నా: రాజాసింగ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



బిజెపికి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు తాను స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతానని గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఇండి పెండెంట్ ఎమ్మెల్యేనని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడు తూ.. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా తనకు ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ ఉందన్నారు. ఒకప్పుడు అసెంబ్లీలో ఏం మాట్లాడాలన్నా పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయం వరకు సభలో మాట్లాడే అవకాశాన్ని పార్టీ ఇచ్చేది కాదని పేర్కొన్నారు. కానీ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇస్తే వివిధ అంశాలు లేవనెత్తుతానన్నారు. తనలాగే బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అసం తృప్తితో ఉన్నారని చెప్పారు. దీనికి తాజా ఉదాహరణ చేవెళ్ల ఎంపీ వ్యవహారమేనని తెలిపారు.



# కాళేశ్వరం నివేదికలో చర్చకురావాలి: బీర్ల ఐలయ్య

వార్త 2లో

# సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

## నూతన జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ శుక్రవారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తి స్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది. 2025 నవంబర్ 23న సిజెఐ బి.ఆర్.గవాయ్ పదవీవిరమణ చేసే వరకు సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ విధులు నిర్వహించనుంది. అయితే జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టుకు ఎంపిక చేస్తూ కొలిజీయం తీసుకున్న నిర్ణయంపై ఆసభ్యుల్లో ఒకరైన జస్టిస్ బి.వి.నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. భారత హైకోర్టు జడ్జీల సీనియారిటీ- జాబితాలో జస్టిస్ పంచోలి 57వ స్థానంలో ఉన్నారని, ఆయనకంటే సీనియర్లుగా ఉన్న పలువురు ప్రతిభావంతులైన జడ్జీలు ఉన్నారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. జస్టిస్ పంచోలికి పదోన్నతి కల్పించాలన్న నిర్ణయం జ్యుడీషియల్ నిర్వహణకు ప్రతికూలంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు కొలీజియం విశ్వసనీయతను ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. 4:1 మెజారిటీ-తో కొలీజియం ఆగస్ట్ 25న జస్టిస్ అరాధేతో పాటు- జస్టిస్ పంచోలిని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టుకు వారి నియామకాన్ని 48 గంటల్లోనే, ఆగస్ట్ 27న ప్రకటించారు. జస్టిస్ పంచోలీ 1968, మే 28న అహ్మదాబాద్‌లో జన్మించారు. 2016 జూన్‌లో గుజరాత్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జులైలో ఆయన పాట్నా హైకోర్టుకు బదిలీ కాగా 2025 జులై 21న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ అరాధే 1964లో జన్మించారు. 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరిలో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జమ్మూకాశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2018లో మే నుండి ఆగస్ట్ వరకు మూడు నెలల పాటు- దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ అరాధే కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్ వరకు దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జులైలో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు అనంతరం 2025 జనవరి 21న బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల జాబితాలో జస్టిస్ అరాధే మూడవ స్థానంలో ఉన్నారు. జస్టిస్ పంచోలి 19వ స్థానంలో ఉన్నారు.

# కాళేశ్వరం వద్ద పోటెత్తిన గోదావరి

## పుష్కర ఘాట్లపై నుంచి వరద ప్రవాహం

**పెద్దపల్లి, అక్షరకలం ప్రతినిధి**

భారీ వర్షాలకు మరోసారి గోదావరిలోకి వరద పోటెత్తింది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంటనష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు- ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

# నగరంలో జంటజలాశయాలకు పోటెత్తిన వరద

## గేట్లు ఎత్తడంతో మూసీలోకి భారీగా వరదనీరు

## పలు మార్గాల్లో రాకపోకలు నిలిపివేత

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో.. కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీకి వరద పోటెత్తింది. ఉస్మాన్ సాగర్ 8 గేట్లు- ఎత్తి 4100 క్యూసెక్కుల నీటిని, హిమాయత్ సాగర్ 3 గేట్లు- ఎత్తి 2300 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేసినట్లు- అధికారులు తెలిపారు. నీటిని విడుదల చేయడంతో బాపుఘాట్, అత్తాపూర్, పురానాపూల్, చాదర్ఘాట్, మూసారంబాగ్ వద్ద వరద తీవ్రత పెరిగింది. దీంతో మూసి పరివాహక ప్రాంతాల ప్రజలను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. జంట జలాశయాల గేట్లు- ఎత్తడంతో జియాగూడ 100 ఫీట్ రోడ్డుపై భారీగా వరద నీరు చేరింది. దీంతో రోడ్డును అధికారులు మూసివేశారు. జియాగూడ పురానాపూల్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పురానాపూల్ నుంచి హైకోర్టుకు వెళ్లే వాహనాలను కార్వాన్ నుంచి దారి మళ్లించారు. కాగా, మూసారాంబాగ్ బ్రిడ్జ్‌పై కూడా.. మూసి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిని మూసివేశారు. వరద ధాటికి బ్రిడ్జ్ పిల్లర్లు పూర్తిగా డ్యామేజ్ అయినట్లు- అధికారులు తెలుపుతున్నారు. అంబర్‌పేట్, దిల్‌షుక్‌నగర్ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మంచిరేవుల వద్ద కూడా మూసీ ఉధృతితో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మూసి వేశారు. దీంతో ఈ ప్రాంతంలో వహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# ర్యాష్ డ్రైవింగ్‌తో ఇద్దరి మృతి

## కేసులో టీవీ నటుడు లోబోకు ఏడాది జైలు

**జనగామ, అక్షరకలం ప్రతినిధి**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతితోపాటు- పలువురు గాయపడటానికి కారణమైన టీవీ నటుడు ఖయూమ్ అలియాస్ లోబోకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జనగామ కోర్టు తీర్పునిచ్చింది. జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీసుల కథనం ప్రకారం.. 2018 మే 21న ఓ టీవీ ఛానల్ తరపున వీడియో చిత్రీకరణ కోసం లోబో బృందం రామప్ప, లక్నవరం, భద్రకాళి చెరువు, వేయిస్తంభాల ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం లోబో స్వయంగా కారు నడుపుతూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఖిలాషాపురం గ్రామానికి చెందిన మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు తీవ్ర గాయాలతో మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కారు కూడా బోల్తా పడటంతో లోబోతో పాటు- బృంద సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతికి కారణమైన లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు- రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు- పోలీసులు వివరించారు.

# తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై ఎసిబి దాడి

## సోదాల్లో భారీగా నడదు, నగలు పట్టుబడినట్లు సమాచారం

**వరంగల్, అక్షరకలం ప్రతినిధి**

వరంగల్ జిల్లా ఖిలావరంగల్ తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు- తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల్లో భారీగా నగలు పట్టుబడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జిల్లాలో వరదల్లో కృషి చేసిన సహాయక బృందాలు

## 775 మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీమ్‌లు

**నిజామాబాద్, అక్షరకలం ప్రతినిధి**

భారీ వర్షాలతో పలుచోట్ల చిక్కుకు పోయిన వారిని రెండు ఎన్డీఆర్ఎఫ్, ఆరు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. జిల్లాలో 14 ఆపరేషన్లు నిర్వహించి 775 మందిని కాపాడాయి. రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఇప్పకాయల వినయ్‌కుమార్(28) ఇంటి గోడ కూలి మృతిచెందారు. అతను గుండారంపల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. తన ఇంట్లోకి నీళ్లు రావడంతో.. రంధ్రం చేస్తుండగా గోడకూలి పైన పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. బీబీపేట జనగామ గ్రామానికి చెందిన కప్పెర రాజిరెడ్డి(60) బుధవారం సాయంత్రం ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యారు. గురువారం ఆయన మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వెలికితీశారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలోని ఎడ్లకట్ట వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యారు. ఇదే వాగులో కారులో వెళ్తున్న తండ్రీకొడుకులు వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడటానికి ప్రయత్నిస్తుండగా మధ్యలోనే కొట్టుకుపోయారు. కొద్దిదూరం వెళ్లాక చెట్టును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. జిల్లావ్యాప్తంగా 50కి పైగా పశువులు మృత్యువాతపడ్డాయి. కుండపోత వర్షాలతో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. శ్రీరామసాగర్, స్వర్ణ ప్రాజెక్టుల నుంచి ఒకేసారి వరద నీరు దిగువకు వదలటంతో నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీ, ఇందిరానగర్, బోయవాడ, నటరాజ్‌నగర్, భాగ్యనగర్, ప్రియదర్శినీ నగర్, శాంతినగర్ కాలనీల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. ప్రధాన వాణిజ్య ప్రాంతమైన శివాజీచౌక్‌లో భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు.

# లంబాడీ, సుగాలీ, బంజారాలు ఎస్టీలు కాదు

## వారిని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్

## విచారణ చేపట్టిన సుప్రీం...కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటీషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎస్టీ జాబితా నుంచి వారిని తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాళీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాళీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ జే కే మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీ-సులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది.

# తీరనున్న యూరియా కష్టాలు

## ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి

## వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

యూరియా కోసం ఎదురు చూస్తోన్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుభవార్త చెప్పారు. యూరియా సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయని.. ఇందులో భాగంగానే వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. 2025, సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకుంటుందని.. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి రాష్ట్రంలోని చాలా జిల్లాలో తీవ్రంగా పంట దెబ్బతిన్నది. ఈ క్రమంలో శక్రవారం సాయంత్రంలోగా పంట నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు వరద ప్రభావిత జిల్లా కలెక్టర్లతోమంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయలు చేశారని మండిపడ్డారు. యూరియాను త్వరలోనే అన్ని జిల్లాలకు సరఫరా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా సాయంత్రం వరదల పంట నష్టంపై సమావేశం నిర్వహిస్తారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# కాళేశ్వరం నివేదికలో చర్చకురావాలి: బీర్ల ఐలయ్య

**హైదరాబాద్,**

కాళేశ్వరం కమిటి నివేదికను అసెంబ్లీలో పెడతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలకు కెసిఆర్ సమాధానం చెప్పుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ..కెసిఆర్ సభలో మాట్లాడతానంటే తమ సమయం కూడా ఇస్తామని, బిసి రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలియజేశారు. మంచి పాలన అందిస్తున్నందుకు మమ్మల్ని తిడతారా? అని ఐలయ్య ప్రశ్నించారు.

# జిఎస్టీ రేట్ రేషనలైజేషన్‌తో రెవెన్యూపై ప్రభావం

## రాష్ట్రాలు బలపడితేనే..దేశం పటిష్టంగా ఉంటుంది

## జిఎస్టీ నష్టాలకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూడాలి

## తెలంగాణ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క డిమాండ్

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

:రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ- సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జిఎస్టి రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే.. దేశం బాగుం టుందని తెలియజేశారు. రేషనలైజేషన్ ను ఆహ్వానిస్తూనే రాష్ట్రాలకు జరిగే నష్టానికి..పరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలని కోరారు. సెప్టెంబర్ 3న మరోసారి ఢిల్లీలో 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో తమ డిమాండ్లు లేవనెత్తాలని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు- నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు- మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన 'జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తరపున భట్టి విక్రమార్క హాజరుకాగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రులు డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ ప్రతిపాదనలతో మొత్తంగా రూ.2లక్షల కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు.

# హైదరాబాద్‌లో నిమజ్జన సందడి

## ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు అమలు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాల సందర్భంగా శుక్రవారం నుంచి సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు- చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన ఊరేగింపునకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, కోడ్ స్కిక్కర్లతో పర్యవేక్షిస్తున్నారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం నుంచి హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు- పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3:00 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ఎ÷-లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ వద్ద వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు- చేశామన్నారు. ఈ నేపథ్యంలో సెయిలింగ్ క్లబ్ జంక్షన్, వీవీ విగ్రహం, తెలుగు తల్లి జంక్షన్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ ఎక్స్ రోడ్డు, నల్లగుట్ట బ్రిడ్జ్, బుద్ధ భవన్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తామని వివరించారు. అలాగే అప్పర్ ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు మార్గాల్లో అవసరాన్ని బట్టి ఆంక్షలు అమలు చేస్తామన్నారు. లిబర్టీ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, పంజాగుట్ట వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు కీలక సూచన చేశారు. అలాగే కవాడిగూడ, బేగంపేట్, మినిస్టర్ రోడ్, తెలుగు తల్లి÷-లపై ఓవర్ మీదుగా ట్రాఫిక్ మళ్లిస్తామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా పండగను దేశవ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ మేరకు హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రతి గల్లీలో భారీగా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు- చేశారు. ఈ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఇవి సెప్టెంబర్ 5వ తేదీతో ముగియనున్నాయి. అందుకోసం ప్రభుత్వం ఏర్పాట్లు- చేసింది. ఇక ఈ నిమజ్జనం నేపథ్యంలో నగరంలో పోలీసులు భద్రతతోపాటు- నిఘాను పటిష్టం చేశారు. ఈ నిమజ్జనానికి తరలివచ్చే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు- చేశారు.

# సాయం కోసం వచ్చిన బోటు బోల్తా

## ప్రమాదం నుంచి బయటపడ్డ ఆర్మీ జవాన్

మెదక్,

:మెదక్ జిల్లాలో ఆర్మీ జవాన్లకి పెను ప్రమాదం తప్పింది. రెస్క్యూ కోసం ట్రయల్ వేస్తుండగా బోటు బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది జవాన్లను రక్షించేందుకు రంగంలోకి దిగారు. తాళ్ల సాయంతో జవాన్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా ఈ నెల 27న వినాయకుని విగ్రహం కొనుగోలు చేసేందుకు కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన 8 మంది చిన్నారులు మెదక్ కు వచ్చారు. భారీగా కురిసిన వర్షాలతో పోచారం వరద ఎక్కువ కావడంతో మూడు రోజులుగా పోచమ్మరాల్ గ్రామంలో చిన్నారులు తలదాచుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్థులు 8 మంది చిన్నారుల ఆలన పాలన చూసుకున్నారు. ఈ క్రమంలో చిన్నారులను ఆర్మీ అధికారులు వారి ఇంటికి పంపేందుకు ప్రయత్నం చేయగా విఫలం అయ్యింది. దీంతో తిరిగి మెదక్ లోని పునరావాస కేంద్రానికి చిన్నారులను తరలించారు. కాగా మెదక్ జిల్లాలో కుండపోత వర్షాలు వణికించిన విషయం తెలిసిందే. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బిఆర్ఎస్ అనాసక్తి

## ఎన్నికకు దూరంగా ఉండాలనేయోచనలో పార్టీ?

**హైదరాబాద్,**

ఉప రా ష్ట్రపతి ఎన్నికల సమయం దదగ్గర పడుతున్నా విపక్ష బిఆర్ఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్, ఎన్డిఎ కూటమిలకు తాము దూరమని ఇప్పటికే కెటిఆర్ ప్రకటించారు. ఈ రెండింటి వల్ల ఒరిగిందేమీ లేదని అంటోంది. దీనిని బట్టి చూస్తుంటే ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాల ని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఎన్నికల్లో పాల్గొనడం వల్ల వచ్చే ఉపయోగం ఏమీ లేదని కెటిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. దీంతో వచ్చే నెల 9న జరుగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికిలో ఎన్డిఎ అభ్య ర్థికి గానీ, విపక్షాల అభ్యర్థికి గానీ ఓటు వేయకుండా తటస్థంగా ఉండాలని పా ర్టి అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రా నికి సెప్టెంబర్ 9లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తా రో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బిఆర్ ఎస్ మద్దతు ఇస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు కెటిఆర్ డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ కానీ, బిజెపి పార్టీ స్పందించలేదు. నిజానికి యూరియా సమస్య కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. దీనికి కాంగ్రెస్‌తో పెద్దగా సంబంధం లేదు. అందువల్ల అధికార పార్టీ యూరియా సరఫరా చేస్తే బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ రాజీనామాతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జర గబోతున్నాయి. ఓటింగ్ విషయంలో బిఆర్ఎస్ వ్యూహం ఏంటనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలో పార్లమెంట్ ఉభయ సభల సభ్యులే ఓటర్లు. బిఆర్ఎస్‌ఉకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, కె.ఆర్ సురేష్ రెడ్డిలు ఎంపీలుగా కొనసాగుతున్నారు. వీళ్లు ఎవరికి ఓటే స్తారనేది ఆసక్తికరంగా మారింది. 2022లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్డిఎ కూటమి తరపున ద్రౌపది ముర్ము, ఇండియా కూటమి తరపున మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా పోటీ- చే యగా, అప్పుడు తెలంగాణ సిఎంగా ఉన్న కెసిఆర్ ఇండియా కూటమి అభ్యర్థి యశ్వంత్ సి న్హాకు మద్దతు ప్రకటించారు ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ ఎలాంటి వైఖరిని తీసుకోబో తున్నారన్నది చర్చనీయాంశంగా మారిం ది. బిజెపిలో బిఆర్ఎస్ పార్టీని విలీనం చే సేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచా రం ఇటీ-వల విస్తృతంగా జరిగింది. ఇలాం టి సమయంలో ఎన్డిఎ అభ్యర్థికి మద్దతు ఇస్తే బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అనే అంటూ మరోసారి విలీన ప్రచారం తెర మీదికి వ చ్చే అవకాశం ఉంటుందని, ఒకవేళ విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సపోర్ట్ చేశారన్న ప్రచారం జరుగుతుందని పార్టీ అధి ష్టానం భావిస్తున్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రాధాన్యతల కారణంగా ఎవరికి మద్దతు ఇచ్చినా సమస్య తలెత్తిందని, కాబట్టి ఉపరాష్ట్ర ఎన్నికలో తటస్థంగా ఉండడమే ఉత్తమం అని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కెటిఆర్ కూఆ తన సన్నిహితలు వద్ద ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అంటున్నారు. అంతెందుకు బహిరంగంగా కూడా ఆయన ఇవే వ్యాఖ్యలు చేశారు. కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకుదూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయంలో పార్టీ ఉంది.

# గిడుగు రామ్మూర్తి జయంతి

## నేడు తెలుగు భాషా దినోత్సవం

**విజయనగరం,**

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడైన గిడుగు వెంకట రామమూర్తి తెలుగు కోసం ఎంతగానో కృషి చేశారు. ఆయన ఉద్యమ ఫలితంగా వాడుక భాషకు మర్యాద దక్కింది. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, తెలుగులో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడైనారు. గిడుగు రామ్మూర్తి జనవరి 22, 1940న మరణించారు. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29 ని 'తెలుగు భాషా దినోత్సవం' గా జరుపుకుంటున్నాము. ఆగష్టు 29, 1863న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. తండ్రి వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండేవారు. చిన్న వయస్సులోనే రామమూర్తి తండ్రిని కోల్పోయారు. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి చదువు



కొనసాగించారు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు.ఆ రోజుల్లో గురజాడ అప్పారావుకు సహాధ్యాయి... ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారు. సవరభాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో 'రావ్ బహదూర్' బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

# నిండుకుండలా మానేరు జలాశయం

## మిడ్‌మానేరులోకి భారీగా వరదనీరు

**కరీంనగర్,**

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణశాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# యూరియా సరఫరాలో అరకొర కేటాయింపులు

## రైతుల అవస్థలు పట్టించుకోని ప్రభుత్వాలు

**అనురావతి,**

ఎరువులకు కొరత లేదని, త్వరలోనే యూరియా వచ్చేస్తుందని సర్కారు చెబుతుండగా పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. గత ఖరీఫ్ రాష్ట్రంలో 6.32 లక్షల టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. 2025 ఖరీఎ÷-లో కేంద్రం 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గించింది. ప్రభుత్వ గణాంకాల మేరకు... నెల వారీ అవసరాల మేరకు ఆగస్టుకు 4.67 లక్షల టన్నులు కావాలి. ఇప్పటికి 3.37 లక్షల టన్నులు వచ్చాయంటోంది. ప్రారంభ నిల్వలతో కలిపి 4.82 లక్షల టన్నులు అమ్ముడయ్యాయి. ఇంకా 1.52 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయి. విజయనగరం, మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆగస్టుకు అవసరమైన యూరియాలో భారీ లోటు-నెలకొంది. మార్కెఫెడ్ తీసుకున్న 70 శాతం యూరియాను తమ గోదాములలో నిల్వపెట్టి బాగా ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లోని ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పిఎసిఎస్), రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్) పంపుతామంటోంది. ఆ విధంగా పంపిన యూరియాలో అధిక భాగం స్థానిక అధికార కూటమి నాయకుల నియంత్రణలోకి వెళుతోంది. ఒక వైపు మార్కెట్లో యూరియా కనిపించకపోవడం మరోవైపు సహకార సంస్థలకు చేరిన ఎరువు సక్రమ పద్ధతిలో పంపిణీ జరగకపోవడంతో రైతులకు యూరియా అగచాట్లు- మరింత పెరిగాయి. రైతుల యూరియా కష్టాలను పరిష్కరించాల్సిన రాష్ట్ర టిడిపి కూటమి



ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలతో మరిన్ని సమస్యలను సృష్టిస్తోంది. సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేదాంట్లో భాగంగా యూరియా కేటాయింపులను తగ్గించిన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాని అవసరమైన యూరియాను సాధించే బదులు, ఇక్కడికి వచ్చిన ఎరువులో అత్యధిక వంతు తానే తీసుకొని రైతులకు పంపిణీ చేయ నిశ్చయించడంతో కొత్త సమస్య ముందుకొచ్చింది. కేంద్రం నుంచి ఎపికి దిగుమతవుతున్న యూరియాలో 70 శాతం మార్క్ఫెడ్కు, తతిమ్మా 30 శాతం ప్రైవేటు డీలర్లకు అంది. ప్రభుత్వ ఈ చర్యను ఎరువుల కంపెనీలు, డీలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిగ్గా యూరియా కొరత తలెత్తిన సమయంలో సర్కార్ తన వాటా పెంచడంతో కంపెనీలు రాష్ట్రానికి యూరియాను దాదాపు బంద్ చేశాయి. తాము యూరియా వ్యాపారం చేయబోమని డీలర్లు మొరాయిస్తున్నారు. దాంతో మార్కెట్లో అమాంతం యూరియా కనిపించని విపత్కర పరిస్థితి నెలకొంది. ఈ పరిణామంతో యూరియా కొరత మరింత తీవ్రమై రైతుల్లో ఆందోళన అధికమైంది. యూరియా కొరతను ఎలాగొలా మేనేజ్ చేయాలన్న హడావుడిలో ఎపి ప్రభుత్వం ఎరువుల పంపిణీపై తనకు కలిగిన అధికారాన్ని ఉపయోగించింది. అరకొరగా ఎపికి వస్తున్న యూరియాలో 70 శాతాన్ని మార్క్ఫెడ్కు స్వాధీనం చేసి, తతిమ్మా 30 శాతాన్ని ప్రైవేట్ డీలర్లకు వాటా వేసింది. రాష్ట్రంలో ఎక్కడికి రైల్వే రేక్ లొచ్చినా మార్ఫెడ్, వ్యవసాయాధికారులు 70 శాతాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. కాగా ఎరువుల కంపెనీలు యూరియా డిమాండ్ను క్యాష్ చేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు ప్రభుత్వం 70 శాతం యూరియాను తన ఖాతాలో వేసుకోవడంతో కంపెనీలు తమ లాభాలు పోతాయని రాష్ట్రానికి మొత్తానికే యూరియా సరఫరాను నిలిపేశాయని తెలిసింది. డీలర్లు కూడా తమకు యూరియా వద్దని తిరస్కరిస్తున్నాయని సమాచారం.

# ఆయల్‌పామ్‌కు అనుకూల వాతావరణం

## సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహం

**ఖమ్మం,**

రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుకు అనుకూల వాతావరణం ఉందని, దీంతో జిల్లాలో రైతులను పెద్ద ఎత్తున ప్రోత్స హిస్తున్నారు. పంట పెట్టుబడులను తగ్గించే ప్రయత్నంలో భాగంగా అనేక జిల్లాల్లో ఆయిల్ పామ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తోంది. ప్రత్యేకించి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కూడా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పదేపదే ఇదే విషయం చెప్పి వారిని ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున సాగు చేసేందుకు ముందు కొచ్చారు. దీనికి సంబంధించి హార్టికల్చర్ శాఖ ఒక నివేదిక రూపొందించింది. ఖమ్మం, సిద్దిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. వాతారణంతో పాటు,నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం,వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పంట సాగు చేసేందుకు అనుకూలంగా ఉంది. నూనె గింజల ఉత్పత్తికి ఉష్ణోగ్రతలు,సాగుకు అనుగుణంగా దిగుబడి ఇచ్చే నేలలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఫలితంగా రైతాంగం ఆయిల్ పాం సాగుకు ఆసక్తి చూపుతు న్నారు. ఎకరా వరి సాగయ్యే నీటితో మూడెకరాల పామాయిల్ పంట సాగవుతుందని, అంతర పంటలతో అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆయిల్ పాం సాగుపై మొదటి నుంచీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు




వర్షాలు కురిసి నీరు సమృద్ధిగా ఉంటే వరి పండిస్తున్నారు. ఆయిల్ పాం ప్రత్నామ్నాయ పంట కానుంది. రాబోయే రెండేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 42,250 ఎకరాల్లో సాగుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. ఇప్పటికే 2,500 ఎకరాల్లో తెలంగాణ ఉద్యానవన శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మొత్తం 246 మండలాలు అనుకూలంగా ఉన్నట్లు సర్వేలో తేలింది. ఈ సాగు వల్ల రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే దీనివైపు రైతులు మొగ్గ చూపేలా చేస్తోంది. ఖమ్మం, నిజామబాద్ లాంటి జిల్లాలు ప్రయోగాలకు ప్రసిద్ధం. ఇప్పటికైతే ఇక్కడ అడుగు పడలేదు. అయితే ఏదైనా పంటప్రయోగం జరగగాలంటే ఇక్కడి రైతులు ముందుకు వస్తారు. వ్యవసాయశాఖ ఈ మేరకు ఆయా జిల్లాల్లో అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రోత్సాహం అందించడంతో పాటు సబ్సిడీ కూడా అందుతున్న కారణంగా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మొక్కదశ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాలుగా సాయం చేయనుంది. రైతులకు మొక్కను రూ.25లకే అందిస్తారు. మొక్కలను కూడా ఉపాధిహామీ పథకం కింద అధికారులు నాటించనున్నారు. మొక్కలను పెంచడానికి ఈ ప్రాంతంలోనే అధికారులు నర్సరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. సబ్సిడీపై వారికి డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు జైపూర్ వద్ద ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం తిప్పలు కూడా తప్పనున్నాయి. ఇక సాగు విషయానికి వస్తే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని, నామమాత్రపు ఎరువులు వాడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

# ఎన్‌హెచ్ 44పై రాకపోకలపై ఆంక్షలు

**భారీ వర్షలతో పలుచోట్ల కొట్టుకుపోయిన రోడ్డు**

**వాహనాలను దారి మళ్లించినట్లు ట్రిఫిక్ డిసిపి వెల్లడి**

**హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల 44వ నంబర్ జాతీయ రహదారి దెబ్బతింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44 వైపు వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద మళ్లిస్తున్నట్లు- పేర్కొన్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలని గజరావ్ భూపాల్ సూచించారు. పోలీసులకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మళ్లింపు మార్గాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ప్రయాణికులకు సహాయం కోసం ట్రాఫిక్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారి ధ్వంసమైందని.. దీంతో 25 శాతం రాకపోకలు మాత్రమే జరుగుతున్నట్లు- ఆ జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు మేడ్చల్-రామాయంపేట్-కామారెడ్డి-డిచ్‌పల్లి మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. భారీ వాహనాలను మేడ్చల్ వద్ద.. సాధారణ వాహనాలను రామాయంపేట వద్ద మళ్లిస్తున్నట్లు- తెలిపారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులకు నిర్మల్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపునకు తిరిగి డైవర్షన్ మార్చుకుని వెళ్లాలని సూచించారు. కొండాపూర్ నుంచి మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

# కామారెడ్డి జిల్లాలో పలు రోడ్లు ధ్వంసం

## బీబీపేట-కామారెడ్డి వంతెన ధ్వంసం

**కామారెడ్డి,**

కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కుంభవృష్టి ధాటికి పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద నీటి దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు క్యాసంపల్లి శివారులో వరద తీవ్రతకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిజామాబాద్ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. క్యాసంపల్లి శివారులో హైవేపై ఏర్పడిన గుంత కారణంగా రోడ్డు ధ్వంసమైంది. మెదక్-బోధన్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పోచారం జలాశాయానికి భారీగా వరద పో-టె-త్తడంతో మెదక్, బోధన్ ప్రధాన రహదారిపై హై లెవల్ వంతెన కొట్టు-కుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరో మార్గం నుంచి వాహనాలు ప్రయాణించే విధంగా అధికారులు ఏర్పాట్లు- చేశారు.

# పలురైళ్లు రద్దు..పలు దారిమళ్లింపు

**హైదరాబాద్,**

తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీంతో పాటు- కొన్ని రైళ్లు దారి మళ్లించినట్లు-, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. 36 రైళ్లు రద్దు, 25 రైళ్లు దారి మళ్లింపు, 14 రైళ్లను పాక్షిక్షంగా రద్దు చేసినట్లు- ఆయన వివరించారు. కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల రైలు మార్గంలో వరద నీరు ముంచెత్తింది. దీంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# తెలంగాణ వరదలకూ ఓ యుద్ధ చరిత్ర

ఈ ఆగస్టులో తెలంగాణలో వర్షాలు బాగా కురుస్తున్నాయి. సరిగ్గా 262 ఏండ్ల కిందట (1763లో) కూడా తెలంగాణలో బాగా వర్షాలు కురిసి గోదావరి వరదలతో ఉప్పొంగింది. ఆ కాలంలో భారతదేశంలో బలవంతులైన మరాఠాలను (శివాజీ వారసులను) ఎదుర్కొంటూ రెండో నిజాం అలీఖాన్ హైదరాబాద్‌కు దక్కన్ ప్రాంత రాజధానిని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గోదావరి వరదలను ఆసరాగా తీసుకొని నిజాం తరఫున పోరాడిన కౌలాస్ రాజాను (కామారెడ్డి జిల్లా) మరాఠాలు మట్టుబెట్టారు. అయినా నిజాం కౌలాస్ రాజా ధైర్యసాహసాలను మెచ్చుకొని ఆయన వారసులకు కౌలాస్‌తో పాటు మరిన్ని జాగీర్లు ఇచ్చాడు. దానితో రాజ్‌పుత్‌లు ఉత్తర తెలంగాణలో రాజరికం చేయడం మొదలుపెట్టి దేశానికి స్వాతంత్ర్యం వచ్చేదాకా పాలించారు. ఆ వివరాల్లోకి వెళ్తే..ఉత్తర భారత్‌లో మరాఠా భూభాగమైన పుణేపై రెండో నిజాం అలీఖాన్ దళాలు దాడి చేశాయి. ఈ సంఘటన గురించి తెలుసుకున్న మరాఠా పేష్వా రఘునాథ్ రావు రెండో నిజాంను వెంబడించాడు. రెండో నిజాం మొదట ఔరంగాబాద్ వైపు తిరోగమించి, తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లాలనుకున్నాడు. బీదర్ కోటలో వర్షాకాలం గడపాలనుకున్నాడు. మరాఠాలు కోపంగా ఉన్నారు. దారిలో రెండో నిజాం దళాన్ని నాశనం చేయాలనుకున్నారు. నిజాం సైన్యం రెండు భాగాలుగా విడిపోయినప్పుడు, మరాఠాలు నిజాం దళాలను వెంబడిస్తూ ఆ సమయంలో వస్తున్న గోదావరి వరదలను తెలివిగా వాడుకున్నారు. రాక్షస భువన్ అనే ప్రదేశంలో గోదావరి నది ఒడ్డున రెండో నిజాం, మరాఠాల మధ్య యుద్ధం జరిగింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ధరూర్ కోటకు ఉత్తరాన ఉన్న రాక్షస భువన్ ఒక చిన్న గ్రామం. పుణేను దోచుకున్న తర్వాత, రెండో నిజాం దాదాపు 1,00,000 ఏనుగులు, గుర్రాలు, ఫిరంగులు, పదాతిదళ సైనికులతో కూడిన సైన్యాన్ని ఔరంగాబాద్ నుంచి బలవంతంగా తరలించారు. దాదాపు 10 కిలోమీటర్ల పొడవైన కాన్వాయ్ రోడ్డుపై కదులుతున్నది (ఔరంగాబాద్- రాక్షస భువన్- లాతూర్- ఉద్గిర్- బీదర్ కోట). రెండో నిజాం సైన్యానికి ధైర్యవంతుడైన రాజా కున్వర్ అజయ్ సింగ్ గౌర్ నాయకత్వం వహించారు. తర్వాత ప్రధానమంత్రి విఠల్ సుందర్ ప్రతాప్వంత్ రావు, ఇతర నవాబులు నాయకత్వం వహించారు.రాక్షస భువన్ సమీపంలోని గోదావరి వద్దకు సైన్యం చేరుకున్నది. రాజాకృష్ణ అజయ్‌చంద్ గౌర్, ప్రధానమంత్రి నేతృత్వంలోని నిజాం అడ్వాన్స్ గార్డులో ఒక భాగం 7-8 వేల మంది సైనికులతో కలిసి గోదావరిని దాటి రాత్రి బస చేశారు. 1763 ఆగస్టు 8, 9 తేదీల్లో భారీ వర్షాలు కురిశాయి. అకస్మాత్తుగా గోదావరికి వరద పోటెత్తింది. గోదావరి ఉత్తర ఒడ్డున ఉన్న నిజాం సైన్యం నుంచి రాజాకృష్ణ అజయ్ చంద్ గౌర్ దళం విడిపోయింది. పేష్వా రఘునాథ్‌రావు రెండో నిజాంను దగ్గరగా వెంబడిస్తున్నాడు. పరిస్థితిని సద్వినియోగం చేసుకొని, మరాఠాలు దాదాపు 8 వేల మంది సైనికులతో కూడిన రాజా అజయ్‌చంద్ దళంపై ఆకస్మిక దాడిని ప్రారంభించారు. మరాఠా సైన్యంలో 50 వేల మంది సైనికులు, గుర్రాలు, ఫిరంగులున్నాయి. రెండు రోజుల పాటు భారీ యుద్ధం జరిగింది. నిజాం సైన్యం, మరాఠాల సైన్యం నిష్పత్తి 1:5 సైనికులు. రాజా అజయ్ చంద్ గౌర్ రాజ్‌పుత్‌లు, గార్దీల (ముస్లిం తెగ)తో కలిసి చాలా ధైర్యంగా పోరాడారు. మరాఠాలు ఫిరంగులను తీసుకువచ్చి గుర్రాలతో దాడి చేశారు. రోజంతా మరాఠాల దాడులు కొనసాగాయి. రాజా అజయ్‌చంద్ గౌర్ తన చివరి మనిషి/ శ్వాస వరకు నిజమైన ధైర్యవంతుడైన రాజ్‌పుత్‌లాగా పోరాడాడు. 1763 ఆగస్టు 10న అతను తీవ్రంగా గాయపడ్డాడు కానీ యుద్ధభూమిని విడిచిపెట్టడానికి నిరాకరించాడు. ప్రధానమంత్రి విఠల్‌దాస్ ప్రతాప్వంత్ రావు కూడా ధైర్యంగా పోరాడి మరణించారు. రాజా అజయ్‌చంద్ గౌర్ సైన్యం సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ వీరోచితంగా పోరాడుతూనే ఉన్నది. చివరికి ఆగస్టు



11న ప్రధానమంత్రి, రాజా అజయ్ చంద్ గౌర్ అమరులయ్యారు. తర్వాత గోదావరి నది ఒడ్డున రాజా అజయ్‌చంద్ గౌర్ సమాధిని నిర్మించారు. నేటికీ ఆ సమాధి ఉన్నది. ప్రత్యక్ష సాక్షులుగా ఉండి గాయపడిన కొద్దిమంది సైనికులు మాత్రమే తమ రాజుల ధైర్యసాహసాల వివరాలను రెండో నిజాంకు వివరించారు. యుద్ధ సమయంలోనూ పరిస్థితి గురించి నిజాం తెలుసుకున్నాడు, కానీ వరదల కారణంగా ఎటువంటి బలగాలను పంపలేకపోయాడు. నిజాం చేసిన వ్యూహాత్మక తప్పిదం, చివరి నిమిషంలో నిజాం సైన్యాన్ని విడిచిపెట్టిన మరాఠా సర్దార్‌ల వెన్నుపోటు కారణంగా ధైర్యవంతులైన రాజా కున్వర్ అజయ్ చంద్ గౌర్, గోపాల్‌సింగ్ సవాయి, ప్రధానమంత్రి రాజా ప్రతాప్వంత్ రావు, మరికొందరు నవాబులు కూడా అమరులయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఆ యుద్ధంలో నిజాం దాదాపు 500 గుర్రాలను, 8,000 మంది సైనికులను కోల్పోయాడు. తన అత్యంత సమర్థుడైన జనరల్‌ను కోల్పోవడంతో నిజాం పూర్తిగా నిరాశ చెందాడు. రాజా అజయ్‌చంద్ గౌర్ ధైర్యసాహసాల గురించి తెలుసుకొని, అతని కుటుంబాన్ని ఓదార్చడానికి కాందహార్ కోటకు వెళ్లాడు.కాందహార్ కోట వద్ద ఈ వార్త విని రాజకుటుంబం దిగ్భ్రాంతికి గురైంది. రాజుల అత్యుత్తమ ధైర్యసాహసాలకు నిజాం ఎంతో ముగ్ధుడై ఆ కుటుంబానికి మరో మూడు జాగీర్లను బహుమతిగా ఇచ్చాడు. రాజా అజయ్ చంద్‌గౌర్‌కు ముగ్గురు కుమారులు. రాజా కున్వర్ లాల్ కబీర్‌సింగ్ గౌర్, రాజా కున్వర్ పదమ్‌సింగ్ గౌర్, చిన్న రాజా కున్వర్ తేజ్ సింగ్ గౌర్. పెద్దవాడు కబీర్ సింగ్ కాందహార్ కోటను వారసత్వంగా పొందాడు. రాజా అజయ్‌చంద్ గౌర్ తమ్ము డు రాజా కున్వర్ నర్పత్‌సింగ్‌కు మాహెూర్ కోట జాగీర్, రాజా కున్వర్ తేజ్ సింగ్ గౌర్‌కు సతారా జిల్లా కన్నెర్ ఖేడ్‌లోని కొన్ని వందల గ్రామాల జాగీర్ ఇవ్వబడింది. చిన్న కుమారుడు పదమ్‌సింగ్‌కు నిజామాబాద్‌లోని కౌలాస్ కోట జాగీర్‌ను ఇచ్చారు. ఆయన, ఆయన వారసులు 120 గ్రామాల పరిధి గల కౌలాస్ కోట సామంత రాజ్యాన్ని 1948 వరకు ప్రజలతో మమేకమై సుభిక్షంగా పాలించారు. వెయ్యేండ్ల చరిత్ర గల కౌలాస్ కోట ఇప్పుడు ఒక దర్శనీయ స్థలం.

# జిల్లాలో విద్యాసంస్థలకు రెండ్రోజులు సెలవులు

**కామారెడ్డి,**

జిల్లాలో కురుస్తున్న అతి భారీ వర్షాలు మూలంగా మరో రెండు రోజులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమవ్వగా.. ఇవాళ కూడా ఆ జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉంటే.. జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 62-87 కిలోమిటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఈ రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ క్రమంలో విద్యాసంస్థలరు సెలవుప్రకటించారు.

# కాకతీయ పరిధిలో పరీక్షలు వాయిదా

## డిగ్రీ, పిజి పరీక్షలు వాయిదా వేస్తూ ప్రకటన

**వరంగల్,**

పలు జిల్లాల్లో ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28, 29 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేందర్ ప్రకటించారు. వర్షాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షల కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా, కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. వర్షాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయని స్పష్టంచేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహించినా, ఇంకా సుమారు 48,630 సీట్లు- ఖాళీగా ఉన్నట్లు- గుర్తించామని ఆయన వెల్లడించారు. ఇంటర్ రెండో సంవత్సరం 13,256 సీట్లు-, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 12,668 సీట్లు-, ఆరో తరగతి 7,543 సీట్లు-, ఏడో తరగతి 5,192 సీట్లు-, ఎనిమిదో తరగతి 3,936 సీట్లు-, తొమ్మిదో తరగతి 2,884 సీట్లు-, పదో తరగతి 3,151 సీట్లు- ఖాళీగా ఉన్నట్లు- వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా సంబంధిత మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

# కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

## మరో రెండ్రోజులు వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్,**

వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఒడిశా, వెస్ట్ బెంగాల్ తీరాలకు సమీపంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సముద్ర మట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ఆవర్తనం రానున్న 24 గంటల్లో అల్పపీడనంగా బలపడనుందని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే తూర్పు ఆగ్నేయ దిశ నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు వృత్తాకార పవన ద్రోణి కొనసాగుతోందని వెల్లడించింది. సిద్దిపేటలోని శ్రీనగర్ కాలనీ వరద నీటిలో మునిగిపోయింది. రోడ్లపై నుంచి నీరు ఉధృతంగా పారుతుండగా, పలు ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు కాలనీలో నిలిచిపోయిన నీటిని బయటకు తరలించే చర్యలు చేపట్టారు. వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం, మరో మూడు రోజులపాటు- తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అనేక జిల్లాలు మళ్లీ వర్ష బీభత్సాన్ని ఎదుర్కొనే అవకాశముందని అధికారులు తెలిపారు. తెలంగాణలో వర్షాల ప్రభావం కొనసాగుతూనే ఉంది. అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు- అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# వరదలతో అప్రమత్తంగా ఉన్నాం

## ఇప్పటికే పదిమంది మృతి చెందినట్లు సమాచారం

**హైదరాబాద్,**

ఉత్తర తెలంగాణను భారీ వర్షాలు ముంచెత్తాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 10 మంది చనిపోయినట్టు- సమాచారం ఉందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు- చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు- చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్లు డీజీపీ వివరించారు. రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు- చేసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు- చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డు

## కుటుంబ వివరాలు..పథకాల నమోదు

## అందరికీ లబ్ధి కలిగేలా పథకాల రీ డిజైన్

## అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు

**అమరావతి,**

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆధార్ తరహాలో 'ఫ్యామిలీ కార్డు' ఇవ్వాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ కార్డులో ప్రభుత్వ పథకాలు సహా అన్ని వివరాలు పొందుపర్చాలని, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయి సమాచారం తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమం అవసరమైతే వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలి. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అందరికీ లబ్ధి కలిగేలా పథకాల రీడిజైన్ అంశం పరిశీలిద్దాం. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై ఏపీ సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఫ్యామిలీ కార్డ్ జారీ చేయాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ కార్డు ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో సహా అన్ని వివరాలను ఫ్యామిలీ కార్డులో ఏపీ ప్రభుత్వం పొందుపరచనుంది. త్వరలోనే పాపులేషన్ పాలసీ తీసుకురావాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఏయే కుటుంబానికి ఏమేం అవసరాలున్నాయనే అంశాన్ని క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమం అవసరమైన వారికి వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి కుటుంబానికి ఇచ్చే ఫ్యామిలీ కార్డులో ప్రభుత్వం ఇచ్చే పథకాల వివరాలను పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆధార్ తరహాలో ఫ్యామిలీ కార్డును ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. అందరికీ లబ్ధి కలిగేలా అవసరమైతే పథకాలను రీ-డిజైన్ చేసే అంశాన్నీ పరిశీలిద్దామని సీఎం చెప్పుకొచ్చారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు పెరగాలని వాటిని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సూచించామని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కార్డుల్లో ఫ్యామిలీలను విభజించుకుంటున్నారంటూ సీఎం వ్యాఖ్యానించారు. కుటుంబం ఉమ్మడిగా ఉన్న సంక్షేమం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ కార్డులకు రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఉల్లి కొరత రాకుండా ముందే జాగ్రత్తలు

## రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ

## అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,**

ఉల్లి పంటను తక్షణమే కొనుగోలు చేసి నిల్వ చేయాలని ముఖ్యమం÷-తరి చంద్రబాబు నాయుడు సూచించారు. కమ్యూనిటీ- హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. రైతుల నుంచి క్వింటాకు రూ.1200 చొప్పున ఉల్లిని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉల్లికి రేటు వచ్చే వరకూ కమ్యూనిటీ- హాళ్లల్లో నిల్వ చేయడానికి రైతులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. వచ్చే పది రోజుల్లో ఐదువేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వస్తుందని అధికారులు వివరించారు. కొనుగోలు చేసి ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లల్లో విక్రయించేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు. తక్షణం ఉల్లిని కొనుగోలు చేసి రైతులకు నష్టం రాకుండా చూడాలని ఆదేశించారు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. రైతుబజార్ల సంఖ్యను పెంచటంతో పాటు- ఆధునీకికరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశర చేశారు సీఎం చంద్రబాబు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పలు కీలక అశాలపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలకు ప్రోత్సాహకాల ప్రతిపాదనలు, పరిశ్రమల కోసం ఏపీఐఐసీ ప్రతిపాదనలు, ప్రైవేటు- పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు చర్చించారు. ప్రైవేటు మెగా ఇండస్ట్రియల్ పార్కులు, టూరిజం శాఖ ప్రతిపాదనలు, విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై మాట్లాడారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ ప్రతిపాదనలకు పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించి ఆమోదం తెలిపామని అన్నారు. ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం ద్వారా రూ. 53,922 కోట్ల పెట్టుబడులతో 83,437 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షంతో జలమయం

## రెండ్రోజులు పాటు విద్యాసంస్థలకు సెలవులు

## అసవరమైతే తప్ప బయటకు రావద్దన్న కలెక్టర్

**నిజామాబాద్,**

అల్ప పీడన ప్రభావం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను భారీ వర్షం అతలాకుతలం చేసింది. రెండు రోజుల పాటు ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ క్రమంల పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. రెండు రోజుల పాలు సెలవులు ప్రకటించారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కామారెడ్డి పట్టణం నీట మునిగింది. లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరింది. దీంతో జిల్లా జలదిగ్బంధనంలో ఉంది. అలాగే నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులన్నీ జలమయ మయ్యాయి. ఉరుములు, మెరుపులతో మొదలైన వర్షం క్రమంగా భారీ వర్షంగా మారింది. దీంతో నగరం దాదాపు జలమయం అయింది. దీంతో భారీగా వరద నీరు చేరి రోడ్లు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు- పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకురావొద్దని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే ఉమ్మడి జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అదేవిధంగా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదావేశారు. శుక్రవారం జరగాల్సిన పరీక్షలను యథాతథంగా నిర్వహిస్తామని వెల్లడించారు. శ్రీరామ్ సాగర్ కు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు లోతట్లు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ జగదీష్ హెచ్చరికలు జారీ చేశారు.

# యువకుడి మృతిపై పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి

## కటుంబానికి అండగా ఉంటామని హామీ

**అమరావతి,**

వాలీబాల్ ఆడటానికి పోల్స్ నిలబెడుతున్న సమయంలో ఆకస్మాత్తుగా విద్యుత్ ప్రసారమై కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఏడిద చరణ్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చరణ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకొని భరోసా ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. ఈ ప్రమాదంలో మరో ఆరుగురు యువకులు గాయపడ్డారని అధికారులు చెప్పారని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు- చెప్పుకొచ్చారు పవన్. బాధిత కుటు-ంబాలు ధైర్యంగా ఉండాలని సూచించారు. క్రీడా ప్రాంగణాల్లో, పని ప్రదేశాల్లో పోల్స్ లాంటివి నిలిపేటప్పుడు, ఎత్తైన ప్రదేశాల్లో నిర్మాణాలు చేపట్టే సమయంలో విద్యుత్ షాక్‌కు ఆస్కారం లేకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏ దశలోనూ అశ్రద్ధ వహించొద్దని, ప్రమాదాలు సంభవిస్తే కుటు-ంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని పవన్ కల్యాణ్ కోరారు.

# 20 ఏళ్లలో ఎప్పుడూ ఇంతటి వర్షం చూడలేదు

**సిద్దిపేట,**

గత 20 సంవత్సరాలలో సిద్దిపేటలో ఇలాంటి వర్షం ఎప్పుడు పడలేదని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో కురిసిన వర్షాలకు కోమటి చెరువు నాల వరద ఉధృతికి గురైన ముంపు ప్రాంతాలు శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయి లో పర్యటించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను, మున్సిపల్ అధికారులను హరీష్ రావు ఆదేశించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



# టాలీవుడ్ హీరోయిన్‌తో పృథ్వీ షా డేటింగ్

టీమిండియా క్రికెటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. రూమర్డ్ గర్ల్ ఫ్రెండ్, టాలీవుడ్ హీరోయిన్ అక్కృతి అగర్వాల్‌తో కలిసి వినాయక చవితి పూజల్లో పాల్గొన్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోస్ అక్కృతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇద్దరూ గణేశుడి విగ్రహం పక్కన నిలబడి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పెయిర్ బాగుంది అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అక్కృతి అగర్వాల్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో టిక్‌టాక్‌లో డ్యాన్స్ వీడియోలు చేసి పాపులర్ అయ్యారు. దేశంలో టిక్‌టాక్ నిషేధించబడిన తర్వాత ఆమె ఇన్‌స్టాగ్రామ్‌పై దృష్టి పెట్టారు. ఇప్పుడు ఆమెకు 3.3 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. యూట్యూబ్ ఛానెల్‌కు 88.8 వేలమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ ఏడాది ఆరంభంలో విడుదలైన 'త్రిముఖ' అనే టాలీవుడ్ మూవీలో అక్కృతి హీరోయిన్‌గా నటించారు. బాలీవుడ్ ఆరంగేట్రంకు సిద్ధమవుతున్నారు. ఫామ్ కోల్పోయిన ప్రథ్వీ షా భారత జట్టులో చోటు కోల్పోయాడు. ముంబై క్రికెట్ అసోషియేషన్‌కు టాటా చెప్పిన అతడు..



ప్రస్తుతం మహారాష్ట్రకు ఆడుతున్నాడు. బుచ్చిబాబు టోర్నీ 2025లో ఆడుతున్న ప్రథ్వీ షా.. ఛత్తీస్‌ఘఢ్ (111)పై సెంచరీ చేశాడు. తమిళనాడుపై కూడా హాఫ్ సెంచరీ బాది సత్తాచాటాడు. లక్నోకు చెందిన అక్కృతి అగర్వాల్.. ముంబైలో చదువుకుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కెరీర్ ప్రారంభించి నటిగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 3.3 మిలయన్ల




ఫాలోవర్లు ఉన్నారు. ఇటీవల విడుదలైన త్రిముఖ చిత్రంలో కూడా ఆమె నటించింది. అక్కృతి అగర్వాల్‌కు సొంతంగా ఓ యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. పృథ్వీ షా, ఆక్కృతి గతంలో చాలా సార్లు కలిసి కనిపించారు. జులైలో పృథ్వీ షా షేర్ చేసిన ఓ ఫొటో కింద అక్కృతి కామెంట్ చేసింది. అప్పుడే ఈ ఇద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తున్నట్లు పుకార్లు మొదలయ్యాయి. తాజాగా ఈ ఇద్దరూ కలిసి గణపతి పూజ చేయడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. పృథ్వీ షా గతంలో ప్రాచీ సింగ్, నిధి తపాడియాతో కూడా డేటింగ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా దూరమయ్యాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో అతను అన్‌సోల్డ్‌గా నిలిచాడు. దేశవాలీ క్రికెట్‌లో ముంబై జట్టు నుంచి తప్పుకున్న పృథ్వీ షా మహారాష్ట్ర తరఫున తన ప్రయాణాన్ని ఘనంగా ప్రారంభించాడు. తమిళనాడు వేదికగా సాగుతున్న బుచ్చిబాబు టోర్నీలో మహారాష్ట్ర తరఫున అరంగేట్ర మ్యాచ్‌లోనే శతకంతో చెలరేగాడు.



# అత్యధిక స్కోర్లు చేసిన జట్లలో భారత్ అగ్రస్థానం

## ఆసియా కప్ టీ20 చరిత్రలో రికార్డు

టీ20 క్రికెట్ అంటే పరుగుల పండుగ. బ్యాటర్లకు ఎక్కువగా కలిసొస్తుందని క్రికెట్ ప్రేమికులు కూడా భావిస్తారు. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్లో జరుగుతుంది. బ్యాట్స్‌మెన్‌లు భారీ స్కోర్‌లతో జట్టుకు విజయాలు అందించారు. అయితే ఈ టోర్నమెంట్‌లో భారత్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. పాకిస్తాన్ 2022 సంవత్సరం షార్జాలో జరిగిన మ్యాచ్‌లో హాంకాంగ్ బౌలర్లను ఉతికారేసింది. పాక్ కెప్టెన్ బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ చేసిన భారీ భాగస్వామ్యంతో 193 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని ఇచ్చింది. ఈ స్కోరు ఆసియా కప్ %ట%20 చరిత్రలో పాకిస్తాన్ జట్టుకు అత్యధిక స్కోరు. భారత్ జట్టు చేసిన స్కోరు ఈ జాబితాలో మూడవ స్థానంలో ఉంది. భారత్ 2022లో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత




ప్రదర్శన చేసింది. ఇండియా 20 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లి అద్భుత బ్యాటింగ్‌తో భారత్ భారీ స్కోర్ సాధించింది. ఈ మ్యాచ్ లో హాంకాంగ్ ఓడిపోయింది. శ్రీలంకతో 2022లో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. శ్రీలంక జట్టు 19.2 ఓవర్లలో




బంగ్లా ఇచ్చిన లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాట్స్‌మెన్‌లు అద్భుతంగా రాణించి జట్టును గెలిపించారు. బంగ్లాదేశ్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 183 పరుగులు



చేసింది. అయితే, ఇంత పెద్ద స్కోరు చేసినా బౌలర్లు డిఫెండ్ చేయలేకపోయారు. శ్రీలంక చివరి ఓవర్లలో అద్భుతమైన బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించింది. టోర్నమెంట్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.



# 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటమే నా లక్ష్యం

## నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు


## ఆటపై విసుగు వచ్చేవరకే ఆడుతూనే ఉంటాను

## టీమ్? ఇండియాకు సీనియర్ ప్లేయర్? మహ్మద్ షమీ

టీమ్? ఇండియాకు సీనియర్ ప్లేయర్? మహ్మద్ షమీ తన రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టాడు. ఇప్పటికే ముగ్గురు సీనియర్ క్రికెటర్లు టెస్టులకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో తన పేరు కూడా జాబితాలో ఉందన్న రూమర్స్‌పై షమీ స్పష్టతనిచ్చాడు. రెండేళ్లుగా టెస్టు క్రికెట్ ఆడని షమీ గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నా, 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడటం తన లక్ష్యమని చెప్పాడు. "నా రిటైర్‌మెంట్ ఎప్పుడనేది ఎవరూ నిర్ణయించలేరు. ఆటపై విసుగు వచ్చేవరకే ఆడతాను. ఒకవేళ అంతర్జాతీయ క్రికెట్‌లో అవకాశం లేకపోతే దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతా.



నేను రిటైర్ అయితే ఎవరి జీవితాలు బాగుపడతాయో చెప్పండి అప్పుడు ఆలోచిస్తా. అంతవరకు ఇలాంటి ఊహాగానాలకు విలువే లేదు" అని షమీ స్పష్టం చేశాడు. తాజాగా తన ఫిట్‌నెస్ పరిస్థితిని కూడా వివరించాడు. "గత రెండు నెలల్లో శరీర బరువును కంట్రోల్ చేశా. నైపుణ్యాలను పదును పెట్టా. సుదీర్ఘంగా స్పెల్స్ వేసేలా ప్రాక్టీస్ చేస్తున్నా. ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో కూడా కష్టపడి సాధన చేశా. ఇప్పుడు అన్ని విషయాల్లో కంఫర్ట్‌గా ఉన్నా" అని చెప్పాడు. "నాకు ఇప్పటికీ ఒక కల ఉంది వన్డే వరల్డ్‌కప్‌ను సగర్వంగా ఎత్తుకోవాలి. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరాం. అభిమానుల మద్దతుతో అక్కడికి వెళ్లాం. కానీ ఫైనల్లో కొంచెం అదృష్టం కలిసి వచ్చిఉంటే ట్రోఫీ మనదే అయ్యేది" అని షమీ గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి షమీ రిటైర్‌మెంట్‌పై వస్తున్న వార్తలు కేవలం గాలివార్తలేనని తాను ఇంకా టీమ్?ఇండియాకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. ఇటీవల షమీ ప్రత్యేక మైలురాయిని చేరుకున్నాడు. వేగంగా 200 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. మొత్తంగా ఈ ఫీట్ సాధించిన రెండో వేగవంతమైన బౌలర్‌గా నిలిచాడు. కేవలం 104వ మ్యాచుల్లో ఈ ఘనతను సాధించాడు. 133 మ్యాచుల్లో ఈ రికార్డు అందుకున్న భారత మాజీ పేసర్ అజిత్ అగార్కర్‌ను అధిగమించాడు. ఓవరాల్‌గా మిచెల్ స్టార్క్ (102) షమీ కంటే ముందున్నాడు. ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. అతడి తర్వాత జహీర్ ఖాన్ (59), జవగల్ శ్రీనాథ్ (47) ఉన్నారు. షమీ తన చివరి వన్డే మ్యాచ్?ను 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో ఆడాడు. అదే ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2023 ఫైనల్ మ్యాచ్. ఆ మ్యాచ్?లో టీమ్?ఇండియా పరాజయంపాలై వరల్డ్ కప్?ను చేజార్చుకుంది. ఆ తర్వాత గాయం కారణంగా షమీ అంతర్జాతీయ క్రికెట్?కు దూరమయ్యాడు. ఇటీవలే ఇంగ్లాండ్?తో ఐదు టీ20ల సిరీస్?లో షమీ మళ్లీ రీఎంట్రీ ఇచ్చాడు. ఆఖరి రెండు మ్యాచ్?లు ఆడాడు. అయితే ఒక మ్యాచ్‌లో వికెట్లేమీ తీయలేదు. మరో టీ20లో మాత్రం మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.



# ఉత్కంఠభరిత యాత్ర..కేదార్ కంఠ!

ఉత్తరాఖండ్.. హిమాలయ పర్వత సానువుల్లో ఉన్న దేవభూమి. మహర్షులు నడయాడిన పుణ్యస్థలి. ఎత్తయిన కొండలు, పచ్చని నేల, చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి రమణీయత ఈ ప్రాంతం సొంతం. ఈ రాష్ట్రంలోని ఉత్తరకాశి జిల్లాలో సముద్ర మట్టానికి 12,500 అడుగుల ఎత్తులో ఉన్న అత్యంత సుందరమైన పర్వత శిఖరం.. కేదార్ కంఠ. అక్కడికి వెళ్లిరావడం ఓ జీవితకాల అనుభవం.శీతకాలంలో ఇక్కడి పర్వత ప్రాంతాలన్నీ మంచు దుప్పటి కప్పేసుకొని అత్యంత రమణీయంగా కనిపిస్తుంటాయి. ఆ మంచు పర్వతాలపై ప్రసరించిన భానుడి కిరణాలు మిరుమిట్లు గొలుపుతూ ప్రత్యేకమైన అనుభూతిని పంచుతాయి. ఉత్తరాఖండ్, ఉత్తర కాశి జిల్లాలో 8,500 అడుగుల ఎత్తులో ఉన్న ఒక చిన్న గ్రామం నైట్వాడ్. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో కేదార్ కంఠ పర్వత శిఖరం ఉంది. సాహస యాత్రికులు











ఆ శిఖరాన్ని చేరుకోవడానికి నైట్వాడ్ నుంచి ట్రెక్కింగ్ ప్రారంభం అవుతుంది. యూత్ హాస్టల్స్ అసో సియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) ఆధ్వర్యంలో ప్రతి ఏటా డిసెంబర్‌లో కేదార్ కంఠ ట్రెక్కింగ్ ప్రోగ్రామ్ జరుగుతుంది. రోజూ ఇరవై ఇరవై అయిదు మంది బృందంగా మొత్తం ఇరవై బ్యాచ్‌లు బయల్దేరతాయి. ఇందుకోసం ముందుగానే బుకింగ్ చేసుకోవాలి.

## చలో ముస్సోరి క్యాంప్..

ఆరోజు మధ్యాహ్నం ఢిల్లీ నుంచి రైలులో ప్రయాణమై రాత్రి 10 గంటలకు ముస్సోరి చేరుకున్నాం. మరుసటి రోజు బయలుదేరాల్సిన బ్యాచ్ వాళ్లంతా ముందురోజు రాత్రికే ముస్సోరి క్యాంప్ చేరుకోవాలని నిబంధన. ఆ రాత్రి క్యాంప్ ఫైర్ వేసుకొని.. చలిని ఎంజాయ్ చేశాం. పాటలు వింటూ, డ్యాన్స్ చేస్తూ ఉల్లాసంగా గడిపాం. ఉదయమే బయల్దేరాల్సి ఉన్నా.. ముసుగుతన్ని పడుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. అలా ఆ రాత్రి తీపి జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఏడున్నరకు ముస్సోరి నుంచి ఇరవై మంది బ్యాచ్.. రెండు వాహనాల్లో బయల్దేరి సాయంత్రం 4 గంటలకంతా నైట్వాడ్ చేరుకున్నాం. పర్వత ప్రాంతం కావడం, దారి పొడవునా అత్యంత రమణీయమైన ప్రకృతి సంపద తోడవడంతో.. ప్రతి అడుగునూ ఆస్వాదిస్తూ వెళ్లాం. నూట అరవై కిలోమీటర్లు వెళ్లడానికి మాకు ఎనిమిది గంటలు పట్టింది. నైట్వాడ్‌లోని ఓ పాఠశాలలో వైహెచ్ఏఐ వారి బేస్ క్యాంప్ ఉంది. అక్కడ మా ధ్రువపత్రాలు చూపించాం. మాకు కేటాయించిన గదుల్లో సామాన్లు సర్దుకున్నాం. రాత్రి భోజనం తర్వాత, క్యాంప్ ఇన్‌చార్జి సమావేశం ఏర్పాటుచేశారు. అనేక సూచనలు ఇచ్చారు. వాటిని మననం చేసుకుంటూ నిద్రకు ఉపక్రమించాం.

## చలి..పులి

మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకే నిద్రలేపారు. విపరీతమైన చలి. గంటసేపు మాతో వ్యాయామం చేయించారు. ఆ తర్వాత వేడివేడి టిఫిన్, టీ ఇచ్చారు. ఆ సమయంలో అది అమృతంలా అనిపించింది. తొమ్మిది గంటలకు అందరికీ ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. అక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శరీరం తనను తాను సర్దుబాటు చేసుకోడానికి 'ఐక్లెమేటైజేషన్ వాక్' పేరుతో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణ మందిరం వరకూ వాకింగ్ తీసుకెళ్లారు. తిరిగి వచ్చాక మధ్యాహ్న భోజనం, విశ్రాంతి. సాయంత్రం టీ తర్వాత మరుసటి రోజు ట్రెక్కింగ్‌కు సంబంధించిన సూచనలు చేశారు. రాత్రి భోజనాల తర్వాత కాసేపు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రామ్స్ నడిచాయి. ట్రెక్కింగ్ పూర్తి చేసుకొని వచ్చినవాళ్లు, మరుసటి రోజు వెళ్లాల్సినవాళ్లు.. అంతా కలిసి ఆడిపాడాం. పొద్దున్నే ట్రెక్కింగ్ ప్రారంభం. ఉదయం ఏడింటికల్లా అల్పాహారం ముగించుకొని లంచ్ ప్యాక్ చేసుకొని 20మంది బృందంగా.. ఇద్దరు గైడ్‌లతో ట్రెక్కింగ్ స్టార్ట్ చేశాం. దారి పొడవునా దేవదారు, పైన్ వృక్షాలు. ఇంకా ఎన్నో అరుదైన వృక్ష జాతులు. అందమైన జంతువులు కూడా కనువిందు చేశాయి. ఎనిమిదింటికి బయల్దేరి మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ ఎనిమిది కిలోమీటర్ల మేర నడిచి సాయంత్రానికి జలోటా థాచ్ చేరుకున్నాం. పదివేల అడుగుల ఎత్తులో ఒక సెలయేరు పక్కన మా క్యాంప్ ఏర్పాటు చేశారు. ఆ సెలయేరు మొత్తం గడ్డకట్టి పోయింది. వంటకైనా, తాగడానికైనా.. మంచును కరిగించి వేడిచేసిన నీళ్లే దిక్కు. క్యాంప్ చేరుకోగానే వేడివేడి ఆలుబోండాలు, టీ అందించారు. సాయంత్రం ఐదున్నరకు అక్కడి నుంచే సూర్యాస్తమయాన్ని ఆస్వాదించాం. అక్కడే గంటసేపు గడిపాం. అసలు సమయమే తెలియలేదు. ఇక రాత్రికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చెప్పి ఏడింటికే భోజనం ఏర్పాటు చేశారు ఇన్‌చార్జి. రోజంతా ట్రెక్కింగ్‌లో అలసిపోవడం వల్ల తొందరగానే నిద్రపట్టింది. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు టిఫిన్ చేసి లంచ్ ప్యాక్ చేసుకొని మళ్లీ ట్రెక్కింగ్ పారంభించాం. మా టార్గెట్ లొకేషన్ పుఖ్రోల థాచ్.. పదకొండువేల అడుగుల ఎత్తులో ఉంది. ఎక్కడ చూసినా తాజా మంచు. మధ్య మధ్యలో హిమపాతం, హరివిల్లు.. మా యాత్రానుభూతిని రెట్టింపు చేశాయి. ఢిల్లీలో అత్యంత కాలుష్య వాతావరణంలో బతుకుతున్న నన్ను స్వచ్ఛమైన ప్రకృతి, నీలిరంగు ఆకాశం, తెల్లటి మేఘాలు.. మరో లోకంలో విహరింపచేశాయి. ప్రకృతి ప్రేమికులు ఇంతకుమించి ఇంకేం కోరుకుంటారు? ఆ అనుభూతి కోసమే దేశం నలుమూలల నుంచీ ఎంతోమంది శ్రమకోర్చి వస్తారు. మా బృందంలో కూడా 10 రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రకృతి ప్రేమికులు ఉన్నారు. అలా 8 కిలోమీటర్ల ట్రెక్కింగ్ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు పుఖ్రోల థాచ్ క్యాంప్ చేరుకున్నాం. వేడివేడి టీ, స్నాక్స్ ఆరగించి సేదతీరాం. ఆ రోజు రాత్రి టెంపరేచర్ మైనస్ 10 వరకు పడిపోవచ్చని మా క్యాంప్ ఇన్‌చార్జి చెప్పారు. తగిన జాగ్రత్తలు సూచించారు.



## వెన్నెల వెలుగులు

తెల్లవారుజామునే 2:30కి నిద్ర లేపారు. మూడు గంటలకల్లా సిద్ధమయ్యాం. వేడివేడి మ్యాగీ, టీ ఇచ్చారు. థర్మాస్‌లో వేడి నీళ్లు నింపుకొని, బ్యాగులు క్యాంప్‌లోనే వదిలేసి హెడ్ టార్చ్ వేసుకొని కేదార్ కంఠ శిఖరానికి బయల్దేరాం. శిఖరాన్ని చేరుకోడానికి 4 కిలోమీటర్ల ట్రెక్కింగ్ చేయాలి. మధ్యలో కొంత కష్టతరమైన దారి ఉంటుంది. పౌర్ణమి రాత్రి కావడంతో చంద్రుని కాంతిలో ప్రకృతి సోయగాలు చూడముచ్చటగా అనిపించాయి. అలా 4 కిలోమీటర్ల ట్రెక్కింగ్ తర్వాత ఉదయం ఆరున్నరకు కేదార్ కంఠ శిఖరం చేరుకున్నాం. ఆకాశం అరుణమయమై అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది. ఆ ఎత్తు నుంచి 360 డిగ్రీల్లో ఎటు చూసినా ప్రకృతి సోయగాలు వర్ణనాతీతం. ఉదయం ఏడు గంటలకు మెల్లమెల్లగా మబ్బులను చెరిపేసుకుంటూ సూర్య భగవానుడు దర్శనం ఇచ్చాడు. అదొక అనిర్వచనీయమైన అనుభూతి. మైనస్ 15 డిగ్రీల వాతావరణ పరిస్థితుల్లో అరగంట సేపు సూర్యోదయాన్ని ఆస్వాదించి తిరుగు ప్రయాణం ప్రారంభించాం. పదిన్నరకంతా క్యాంప్ చేరుకున్నాం. పదకొండు గంటలకు భోజనం చేసుకొని 9 వేల అడుగుల దిగువన ఉన్న అఖోటి థాచ్‌కి బయలుదేరాం. సాయంత్రం 4 గంటలకు క్యాంప్ చేరుకొని టీ, స్నాక్స్ తీసుకొని ఆ రాత్రికి క్యాంప్‌లోనే ఉండిపోయాం. రాత్రంతా, గత ఐదు రోజులూ తీసిన అద్భుతమైన చిత్రాలను ఇచ్చిపుచ్చుకున్నాం. ఆనందాన్ని పంచుకున్నాం. మరుసటి రోజు.. ఉదయం అఖోటి థాచ్‌లో బయల్దేరి సాయంత్రానికి నైట్వాడ్ క్యాంప్‌కు చేరుకొన్నాం. ట్రెక్ పూర్తి చేసినట్టుగా.. అధికారులు అందించిన సర్టిఫికెట్ తీసుకొని రాత్రి అక్కడే బసచేశాం. తెల్లారగానే నైట్వాడ్ నుంచి డెహ్రాడూన్ బయల్దేరాం. సాయంత్రం డెహ్రాడూన్ నుంచి ఢిల్లీ రైలులో జ్ఞాపకాల లగేజీతో ఇంటికి చేరుకున్నాం.



అక్షరకలం
తెలుగు దినపత్రిక






# ఎల్లమ్మ కథానాయకుడిగా కార్తీ?

'బలగం' సినిమాతో పదికాలాలు గుర్తిండిపోయే గొప్ప విజయాన్ని అందుకున్నారు నటుడు, దర్శకుడు వేణు యెల్దండి. తన నెక్ట్స్ సినిమాగా ఆయన 'ఎల్లమ్మ'ని ప్రకటించడంతో షూటింగ్ ప్రారంభించకముందే సినిమా చర్చనీయాంశమైంది. ఇందులో హీరోగా నితిన్ నటించనున్నట్టు ఎనాడో ప్రకటించారు. అయితే.. ప్రస్తుతం లెక్కలు మారినట్టు తెలుస్తున్నది.ఈ సినిమా బడ్జెట్ 70కోట్లకు తేలడంతో మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని పాన్ ఇండియా స్టార్‌తో వెళ్లాలని నిర్మాత దిల్ రాజు భావిస్తున్నారట. ఇందులో భాగంగా తమిళ, తెలుగు భాషల్లో క్రేజ్ ఉన్న హీరో కార్తీని సంప్రదించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం. ఇందులో కథానాయిక 'ఎల్లమ్మ' పాత్రకు సాయిపల్లవి, కీర్తిసురేశ్ ఇద్దరిలో ఒకర్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ సినిమాకు చెందిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.





# సంక్రాంతికి రాజాసాబ్

ఎట్టకేలకు రాజాసాబ్ ఆగమనానికి రంగం సిద్ధమైంది. వచ్చే జనవరి 9న 'ది రాజాసాబ్'ని విడుదల చేయనున్నట్టు నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విలేకరుల సాక్షిగా ప్రకటించారు. దీంతో డార్లింగ్ అభిమానుల్లో సంక్రాంతి సంబరాలు అప్పుడే మొదలైపోయాయి. పాన్ ఇండియా సూపర్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా 'ది రాజాసాబ్'. ఇక దర్శకుడు మారుతి ఈ తరహా సినిమాలు తెరకెక్కించడంలో సిద్ధహస్తుడని అందరికీ తెలిసిందే. దానికితోటు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్.. ముగ్గురు అందాలభామలు. మరోవైపు సంజయ్‌దత్.. ఇన్ని ప్రత్యేకతలతో వస్తున్న 'ది రాజాసాబ్' అసలు సిసలు సంక్రాంతి సినిమా అని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. సంజయ్‌దత్ ఇందులో భూతంగా కనిపిస్తారని సమాచారం. ప్రభాస్, సంజయ్‌దత్ కాంబినేషన్ సీన్స్ ఆడియన్స్‌ని కడుపుబ్బ నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు' కూడా వచ్చే సంక్రాంతికే రానుంది. అలాగే.. దళపతి విజయ్ 'జననాయకుడు' కూడా అదే డేట్‌లో రానున్నదని సమాచారం. దీనిబట్టి చూస్తే.. రేపు సంక్రాంతి జాతర సామాన్యంగా ఉండదు.

# తను పక్కన లేకుంటే నిద్ర పట్టేదికాదు

'ఓ దశ వరకూ తల్లిదండ్రుల సహకారం ప్రతి ఒక్కరికీ అవసరమే. ఈ విషయంలో ఎవరూ మినహాయింపు కాదు..' అంటున్నారు అందాలభామ శ్రీలీల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తల్లితో తనకున్న అనుబంధాన్ని వివరించారామె. అలాగే కెరీర్ పట్ల తాను తీసుకున్న కొత్త నిర్ణయాన్ని కూడా తెలియజేశారు. 'చాలా చిన్న వయసులో నటిని అయ్యాను. ఆ టైమ్‌లో సినిమా ప్రపంచం ఎలా ఉంటుందో నాకు తెలీదు. అందుకే నాతో పాటు అమ్మ కూడా లొకేషన్‌కి వచ్చేది.అలాగే నా కథలు కూడా అమ్మే వినేది. నా సినిమాలను కూడా అమ్మే నిర్ణయించేది. ఈ కారణంగా ఆమె కెరీర్ చాలా నష్టపోయింది. ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం మా అమ్మ. కొన్ని నెలల క్రితం వరకూ కూడా అమ్మ పక్కన లేకుండా నిద్ర పోయేదాన్ని కాదు. ఇప్పుడిప్పుడే సోలో లైఫ్ అలవాటు చేసుకుంటున్నా. అది కూడా అమ్మ నిర్ణయమే. ఎప్పుడూ ఒకరిపై ఆధారపడ కూడదు అనేది అమ్మ ఫిలాసఫీ. నిజానికి ఇకపై నిర్ణయం నాదే అయినా.. ఫైనల్ డెసిషన్ మాత్రం అమ్మదే. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా నా ప్రయాణాన్ని నేను చక్కబెట్టుకోవాలనేది అమ్మ ఆకాంక్ష. ఓ విధంగా మా అమ్మ నా బాధ్యతను పెంచింది.'అంటూ శ్రీలీల చెప్పుకొచ్చారు. రవితేజతో ఆమె నటించిన 'మాస్ జాతర' చిత్రం త్వరలో విడుదల కానుంది.



# మైసూరులో పెద్ది ఆటపాట

'పెద్ది' పాత్ర పోషణకోసం.. తానే ఓ శిల్పిగా మారి, తనకు తాను చెక్కుకుంటున్నారు రామ్‌చరణ్. ఆ పాత్రకు కావాల్సిన దేహ దారుఢ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారాయన. అందుకోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నారు. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాను మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి.ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పీక్స్‌కు తీసుకెళ్లాయి. ప్రస్తుతం మైసూర్‌లో రామ్‌చరణ్ మీద ఒక గ్రాండ్ సాంగ్ షూట్ స్టార్ట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ పాటను ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచారు. రామ్‌చరణ్‌తోపాటు వెయ్యిమందికి పైగా డాన్సర్లతో చిత్రీకరిస్తున్న ఈ పాట విజువల్ ఫీస్ట్‌లా ఉంటుందని, రామ్‌చరణ్ తన ట్రేడ్ మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో చేసిన మాస్ స్టెప్పులు ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రధారులు.



# అర్హత కలిగిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి..

సిపిఎం పార్టీ జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు కొమ్ము శ్రీను...



**అక్షరకలం/తిరుమలాయపాలెం :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లులు పథకం అర్హత కలిగిన నిరుపేదలకి మంజూరు చేయాలని ఈరోజు వెదలచెరువు గ్రామంలో నిరుపేదల ఇళ్ళను పరిశీలించటం జరిగింది అత్యంత దారుణంగా వారి పూరి గుడిసెలలో నివాస ఉంటున్నారు రేకులు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు ఇంటి చుట్టూ తేరలు కట్టుకొని కనీస సౌకర్యాలు లేకుండా కూడా ఆ ఇళ్లలో నివసిస్తున్నారు అర్హత కలిగిన వీరికి వెంటనే ప్రభుత్వం అధికారులు రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యంతో ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల కేటాయించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు తిరుమలాయపాలెం మండల మండల సిపిఎం కార్యదర్శి కొమ్ము శీను విజ్ఞప్తి చేశారు. వెధర్ల చెరువు గ్రామంలో కొద్ది మందికి ఇళ్లస్థలాలు మంజూర అయినప్పటికీ అర్హత కలిగిన వారిని లిస్టులో ఉన్నప్పటికీ వారికి మంజూరు చేయకపోవడం విచారించదగ్గ విషయమని అధికారులు వెంటనే స్పందించి వీ సర్వేలు చేసి అర్హత కలిగిన వాళ్ళందరికీ పిల్ల మంజూరు కి ఐదు లక్షల కేటాయించాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు గ్రామంలోని ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ రోడ్లు లేకపోవడం వలన బురద రోడ్లలో నడవ లేక ప్రజలు ఇబ్బంది గురవుతున్నారని సిసి రోడ్లు డ్రైన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ పర్యటనలో సిపిఎం పార్టీ మండల నాయకులు నేరుసుల వెంకటేష్ వెదుళ్ళ చెరువు గ్రామ శాఖ కార్యదర్శి పుల్ల కానీ వెంకట నరసయ్య పుట్టల గురవయ్య ఎడ్ల లక్ష్మి పులకని రమేష్ వేగినాటి మంగతాయి కాంపాటి శ్రీదేవి ఉమేష్. బాలమ్మ కుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో బులియన్ మర్చంట్ నూతన కమిటీ కి సన్మానం



**సూర్యాపేట / అక్షర కలం ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంస్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన బులియన్ మర్చంట్ అసోసియేషన్ నూతన కమిటీని జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ వ్యవస్థ స్వర్ణకారుల ఉనికికి ప్రమాదం తెచ్చేలా ప్రస్తుతం ఉందని తెలిపారు. యూనియన్ సభ్యులు అంతా ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. ప్రభుత్వాలు స్వర్ణకారులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవలనూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అంతటి విజయ్ తో పాటు ప్రధాన కార్యదర్శి మన్నెం సింహాద్రి, కోశాధికారి బూర్లె మధు సూధన్ ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి తొగిటి మురళి, రాష్ట్ర గౌరవ సలహాదారులు నారాయణదాసు రామాచారి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల శ్రీనివాస్, శ్రీపాద లక్ష్మణాచారి, చేపూరి లక్ష్మణాచారి, నారాయణదాసు వెంకన్న, జానీ, కందుకూరి రమేష్,నాగాచారి, బోనగిరి పవన్, రంగ రవితేజ, కొక్కిమల్లఅనిల్ కుమార్, పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షులు నాగిళ్ల మురళిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం....

**నల్లగొండ,ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు గారికి వివిధ అంశాలు వివిధ సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. రైతులకు మరియు ఉద్యోగస్తులకు విద్యార్థులకు ప్రతి ఒక్కరికి సంఘ పక్షాన ఎలాంటి అవసరం ఉన్న వారికి ఎప్పుడూ అన్ని రకాలుగా అండగా ఉంటానని %అస్త్రశీ% అధ్యక్షులు వారు తెలియజేయడం జరిగింది బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు వంగూరు ప్రశాంత్ రాష్ట్ర గౌరవ సలహాదారులు కందుల విజయ్ కుమార్ సెంట్రల్ కమిటీ మెంబర్ కొండేటి నరేష్ కుమార్ జిల్లా కరీంనగర్ కొండన్న కోకన్వీనర్ వినోద్ రాష్ట్ర కార్యదర్శి బాకీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# డి.వై.ఎఫ్.ఐ కారేపల్లి మండల నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా ధారావత్.వినోద్,ఆదేర్ల. వినయ్ లను ఏకగ్రీవంగా ఎన్నిక.

**అక్షర కలం/ కారేపల్లి:**

లిస్థానిక భాగం రామనార్సయ్య భావన్ లో ఏకగ్రీవంగా ఎన్నుకోన్నట్లు డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్ తెలిపారు.మండల ఉపాధ్యక్షులుగా చినుముల.భరత్,నరేష్,క ిన్నెర.కిరణ్,గడ్డం.దీలిఫ్, సహాయ కార్యదర్శులుగా నవీన్,నరేందర్,సంపత్,సాంబ కమిటీ సభ్యులుగా వెంకటేష్,శ్రీధర్,అనిల్,రణధీర్, సలీమ్,రఘు,నాగరాజు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రనీ ఆయన ప్రకటించారు.ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్ లో కారేపల్లి మండలంలో డి.వై.ఎఫ్.ఐ నీ బలమైన యువజన సంఘంగా నిర్మించాలని ఆయన అన్నారు.



# ప్యాక్స్ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరాకు చర్యలు.....

## రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## యూరియా పంపిణీలో చిన్న అవకతవకలు జరిగినా

## స్పాట్ లో సస్పెండ్

## కూసుమంచి క్యాంపు కార్యాలయంలో యూరియా సరఫరాపై సమీక్షించిన మంత్రి పొంగులేటి

**అక్షర కలం/ పాలేరు:**



పాలేరు నియోజకవర్గం పరిధిలో ఇక నుంచి ప్యాక్స్ కేంద్రాల ద్వారా మాత్రమే రైతులకు యూరియా సరఫరా జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు, శుక్రవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి యూరియా సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన స్థాయిలో యూరియా సరఫరా చేయని కారణంగా కొంత యూరియా కొరత మన రాష్ట్రంలో ఉందని అన్నారు. రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్. ఉత్పత్తి సాంకేతిక సమస్యల వల్ల నిలిచి పోయిందని అన్నారు. ఖమ్మం జిల్లాకు రాబోయే 7 రోజులలో 1600 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వస్తుందని అన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్యాక్స్ సోసైటిల ద్వారా మాత్రమే రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు.వ్యవసాయ శాఖ ద్వారా క్రమ పద్ధతిలో రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎటువంటి తప్పులు జరగరాదని అన్నారు. గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అమ్మినట్లు రిపోర్టు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో సమస్య ఉండటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అమ్మకం యూనిట్లను పెంచాలని, సహకార శాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బందిని డిప్యూటేషన్ లో తీసుకోవాలని, పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని, రైతులకు నేరుగా యూరియా అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఇక నుంచి ప్రైవేటు రంగానికి యూరియా బ్యాగ్ ఇచ్చే ఆస్కారం లేదని, వ్యవసాయ సహకార సంఘాల నుంచి అదనపు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేయాలని, సెప్టెంబర్ సీజన్ ముగిసే వరకు యూరియా అమ్మకాలకు అనుమతిస్తూ టెంపరరీ లైసెన్సులు జారీ చేయాలని అన్నారు. యూరియా పంపిణీలో ఎవరైనా చిన్న అవకతవకలకు పాల్పడిన స్పాట్ లో సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సబ్ సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. యూరియా పంపిణీ పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్ అధికారినీ నియమించాలని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాకు వచ్చే యూరియా స్టాక్ ఇప్పటి వరకు 60 శాతం మార్కెట్ ద్వారా వ్యవసాయ సహకార సొసైటీలకు, 40 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయించి రైతులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మంత్రి ఆదేశాలు మేరకు పాలేరు నియోజకవర్గం పరిధిలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఇక నుంచి ప్యాక్స్ ద్వారా మాత్రమే యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్రతి ప్యాక్ సొసైటీ పరిధిలో అవసరమైన మేర సబ్ సెంటర్లను అదనంగా ఏర్పాటు చేసి పారదర్శకంగా యూరియా పంపిణీకి చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సబ్ సెంటర్ పరిధిలో ఉన్న భూమికి తగ్గట్లుగా అవసరమైన ఎరువుల స్టాక్ అందుబాటులో పెట్టాలని, పోలీసుల భద్రతతో ఎకరానికి ఒక బ్యాగ్ చొప్పున రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు పరిశీలించి నేరుగా యూరియా పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇతర అవసరాలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయించాలి

## క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు క్రీడాకారులు పోటీపడాలి

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంలో నిర్వహించిన 3కె రన్ ను ప్రారంభించి, పాల్గొన్న జిల్లా కలెక్టర్





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని, ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.స్థానిక సర్ధార్ పటేట్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్ధార్ పటేట్ స్టేడియంలో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ సన్మానించి, జ్ఞాపికలు అందించారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి చేసిన సేవలు, ఆయన గొప్పతనాన్ని, క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ క్రీడల పోటీల వలన ఆరోగ్యం, ఉల్లాసం, సాంఘిక సౌభ్రాతృత్వం పెరిగి శారీరక, మానసిక పనితీరు మరింత మెరుగవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయించాలని, క్రీడలు ఆడటం వల్ల మనకు ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. గ్రామీణా ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం అధికంగా ఉంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఆత్మవిశ్వాసం, ధైర్యం వంటి లక్షణాలు విద్యార్థులలో అలవాడతాయని అన్నారు. క్రీడలలో ఎంపిక అవడం వలన విద్య, ఉద్యోగ ఉపాధి లో మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.భారత దిగ్గజం హాకీ ఆటగాడు దేశానికి, క్రీడా రంగానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ కొనియాడారు. భారతదేశానికి క్రీడల్లో కీర్తి సంపాదించి పెట్టిన క్రీడా దిగ్గజం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపడం అభినందనీయమన్నారు.యువతకు క్రీడా స్ఫూర్తినిచ్చేందుకు ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయి క్రీడల్లో చేరేవారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోనే యువతకు అందుబాటులో స్టేడియాల సమర్థ వినియోగం, అధునాతన పరికరాలు, కోచ్‌లకు మంచి ప్రమాణాలతో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, మంత్రుల సహాకారంతో క్రీడాకారులను ప్రోత్సహించడానికి భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని స్టేడియంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ ఇన్ డోర్ స్టేడియంలో యునెక్స్ సన్ రైజ్ 11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ బాలబాలికల బాట్మ్ మెంట్ చాంపియన్ షిఫ్ పోటోలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా శుక్రవారం ఉదం 3కె రన్ ను సర్ధార్ పటేట్ స్టేడియం వద్ద ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి, 3కె రన్ లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఇల్లెందు క్రాస్ రోడ్, జిల్లా కోర్టు, ఇందిరనగర్ సెంటర్ నుండి జెడ్పి సెంటర్ మీదుగా రన్ ర్యాలీ సాగింది.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, అధికారులు, కోచ్ లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి..

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు వార్డుల వారిగా డ్రాఫ్ట్ ఫోటో ఎలక్టోరోల్ గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈ నెల 28 న ప్రదర్శించామన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కార్యాచరణ చేశామన్నారు. అసెంబ్లీ ఓటర్లను వార్డుల వారిగా గ్రామ పంచాయతీ ఎలక్టోరోల్ పై తిరిగి కూర్పుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోగా సంబంధిత ఎంపిడివో కు సమర్పించాలన్నారు. ఇట్టి అభ్యంతరాలను ఈ నెల 31 న పరిష్కరించి, సెప్టెంబర్ 2 న వార్డుల వారిగా గ్రామ పంచాయతీ తుది ఫోటో ఎలక్టోరల్ రోల్స్ పబ్లికేషన్ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. జిల్లాలో 571 గ్రామ పంచాయతీలకు గాను 5 వేల 214 వార్డులు ఉన్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. 8 లక్షల 2 వేల 690 ఓటర్లకు 5 వేల 214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ నెల 30 న మండల స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగపద్మజ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ నుండి మిట్టపల్లి కిషోర్, బిజెపి నుండి జి. విద్యాసాగర్ రావు, వై. రాఘవ రావు, సిపిఐ(ఎం) నుండి బండి రావెలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఏ. గోపాల్ రావు, ఎస్. రాజయ్య, భారత రాష్ట్ర సమితి నుండి బి. తిరుమల రావు, బెల్లం వేణుగోపాల్, బంక మల్లయ్య, తెలుగుదేశం పార్టీ నుండి కె. కరుణాకర్, ఎం. లహరి, సీపీఐ నుండి ఎం. శ్రీనివాసరావు, ఎస్. నరసింహ రావు, సిపిఐ(ఎంఎల్) ప్రతినిధి ఝాన్సీ లక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం







## - అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## - తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**అక్షర కలం/ పాలేరు:**

పేదల సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించి, పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూస్, రెండు జతల సాక్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... గతంలో ఉన్న బీటీ రోడ్డు గత సంవత్సరం వచ్చిన వరదలో కొట్టుకొని పోయిందని, కోటి 22 లక్షలతో పాలేరు పిడబ్ల్యుడి రోడ్డు నుంచి హట్యాతండా వరకు బీటీ రోడ్డు మరమ్మతుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గతంలో వరదలకు దెబ్బతిన్న కాలువలు, రోడ్ల మరమ్మత్తు పనులు, అంతర్గత సీసీ రోడ్డు, పశు వైద్యశాల, త్రాగునీటి సరఫరా పనులు, లింక్ కెనాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా ముగించి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.మల్లాయిగూడెం నుంచి భగత్ వీడు వరకు రూ. 3 కోట్ల 30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, గతంలో రూ. 45 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, త్రాగునీటి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. లింగారంతండాలో రూ. 20 లక్షల రూపాయలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించామని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత లింగారాం తండా, గన్యా తండా వేరు వేరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ భవనానికి ప్రహరీ గోడ, అంగన్వాడీ భవనం త్వరలో మంజూరు చేస్తామని అన్నారు.జీళ్ల చెరువు గ్రామంలో రూ. 2 కోట్ల 25 లక్షలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు ఉన్న ఘాట్ రోడ్డు, రూ. 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. జీళ్ళ చెరువు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం డబుల్ లైన్ రోడ్డు, సైడ్ డ్రైయిన్లతో అద్భుతంగా తీర్చిదిద్దే దిశగా డిజైన్ చేశామని, ఈ రోడ్డు త్వరగా పూర్తి చేసి ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత ప్రజల దీవెనలతో పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయల గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 7 లక్షల రేషన్ కార్డులు జారీ, రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ నిధుల జమ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు అందించామని, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు.పేదల సొంతింటి నిర్మాణాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 4.5 లక్షలు ఇండ్లు మంజూరు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3500 పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, 4 విడతల్లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తు న్నామని, ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజులలో అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు.సంక్షేమ హాస్టల్స్ లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జెస్ పెంచడం జరిగిందని అన్నారు. అనంతరం కూసుమంచి మండలం జీళ్లచెరువు ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో షూస్, రెండు జతల సాక్స్ లను మంత్రి పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డిప్యూటీ సిఈఓ నాగపద్మజ, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి లో గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఉత్సవం



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

తెలుగు భాష వ్యవహారిక రూపాన్ని సంతరించుకోవడం కోసం తన జీవితాన్ని అర్పించిన వ్యవహారిక భాష ఉద్యమ స్ఫూర్తి గిడుగు రామమూర్తి పంతులు జయంతి%% సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వ్యవహారిక భాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ వ్యవహారిక భాష ఉద్యమం కారణంగానే తెలుగు భాష యొక్క విస్తరణ పెరిగిందని విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువ సులభంగా నేర్చుకోగలిగిన స్థాయి అందాయని అందుకు కృషి చేసిన మహానుభావులకు నివాళులర్పించారు.పాఠశాల ప్రిన్సిపల్ పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పట్ల ప్రేమ గౌరవం కలిగి ఉండాలని ఎన్ని ఇతర భాషలు నేర్చుకున్న మాతృభాష యొక్క స్థాయి ఎన్నడు తగ్గదని మాతృభాషలో ప్రావీణ్యం లేని వారికి ఇతర భాషల పట్ల పాండిత్యం అవ్వదని అన్నారు.ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

## ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి రాహుల్ ఐఏఎస్




**అక్షర కలం/ భద్రాచలం ప్రతినిది**

మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచల పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల కారుణ్య అనాధ ఆశ్రమంలోని పిల్లలకు ఇరవైవేల రూపాయల విలువగల నిత్యవసర వస్తువులను భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి రాహుల్ ఐఏఎస్ చేతులమీదుగా పిల్లలకు పంపిణీ చేయడం జరిగినది.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ బి రాహుల్ ఐఏఎస్ మాట్లాడుతూ తల్లి తండ్రులు లేని పిల్లలను చేరదీసి ఆశ్రయం కల్పిస్తూ, విద్యాబుద్ధులు నేర్పుతున్న ఆశ్రమ నిర్వాహకులను సునీల్ ను అభినందించారు. అలాగే ఈ అనాధ పిల్లల కోసం ఇరవై వేల రూపాయలు విలువగల నిత్యవసర వస్తువులు పంపిణీ చేసినందుకు ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అలాగే ఏజెన్సీలో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు .ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ కొప్పుల.మురళి మాట్లాడుతూకెనడాలో ఉంటున్న నా స్నేహితురాలునల్లగట్ల రాధ ,నల్లగట్ల వెంటరామయ్యలా వారి ఆర్థిక సహకారంతో కారుణ్య అనాధ పిల్లల ఆశ్రమంలోని పిల్లలకు ఇరవైవేల రూపాయల విలువగల నిత్యవసర వస్తువులు పంపిణీ చేసామని తెలిపారు. పిల్లల కోసం ఆర్థిక సహాయం అందించిన నల్లగట్ల.రాధ , నల్లగట్ల. వెంట్రామయ్య దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు ప్రస్తుత సమాజంలో ఎవరిది వారు చూసుకుంటున్న పరిస్థితులలో కూడా కెనడాలో ఉంటూ అనాధ పిల్లలకు సహాయం అందించాలని అడగగానే వెంటనే వారి వంతు సహాయం అందించి అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు ..భవిష్యత్తులో కూడా ఈ అనాధ పిల్లల ఆశ్రమానికి ట్రస్ట్ ద్వారా మా వంతు సహాయక సహకారాలు అందిస్తామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా మీ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలందరూ ఇష్టం తో కష్టపడి చదివి మంచి స్థాయిలో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ కొప్పుల మురళి , ట్రస్ట్ నిర్వాహకులు నవీన్, వంశీ , సాయి కుమార్, బాబాజీ , సోలా ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు , భద్రాచలం ఆదివాసీ సమితి అధ్యక్షులు పూనెం.కృష్ణ దొర తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**అక్షర కలం /భద్రాచలం ప్రతినిధి**

వాజేడు మండలంలోని చింతూరు గ్రామంలో వాజేడు మండల బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు ములకల సందీప్ ఆధ్వర్యంలో బి. ఎస్ .పి.పార్టీలో చింతూరు గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలు జాయిన్ అవ్వడం జరిగింది ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం అసెంబ్లీ అధ్యక్షులు కొండా చరణ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజల అభివృద్ధి కోసం సామాజిక న్యాయం కోసం రాజ్యాధికారం కోసం పనిచేస్తున్న పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని అన్నారు భారత రాజ్యాంగంరక్షింపబడినప్పుడే భారత రాజ్యాంగం సంపూర్ణంగా అమలు జరిగినప్పుడే బహుజన జాతుల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు బి ఎస్ పి మాత్రమే భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో చిత్తశుద్ధితోటి పనిచేస్తుందని భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేయగలిగే ఏకైక పార్టీ బి.ఎస్.పి.అని తెలిపారు బహుజన్ సమాజ్ పార్టీలో జాయిన్ అవడం వీరి చైతన్యానికి నిదర్శనమని వారికి బి.ఎస్.పి నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తెల్ల%శీ% వెంకటరావు చింతూరు గ్రామానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాడని



అన్నారు చింతూరు గ్రామం వరకు ఉన్న రోడ్డుని ఇప్పటివరకు నిర్మించలేదని చింతూరు పంచాయతీలోని పంచాయతీ కార్యాలయాన్ని చింతూరు కి ఇప్పటివరకు తరలించలేదని పాఠశాలను నిర్మించలేదని విమర్శించారు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని వెంకట్రావు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని విమర్శించారు బీ.ఎస్.పి.కి అధికారం ఇస్తే ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించబడతాయని అన్నారు బహుజనులు బి.ఎస్.పి.ని ఆదరించాలని బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బి.ఎస్.పి. వాజేడు మండల అధ్యక్షులు ములకల సందీప్, అంజి బాబు, రాములు, చెంచు, వేణు, సాయి తేజ, నాగరాణి, సరోజిని, సమ్మక్క, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.






# కొత్త పరిశ్రమలకు అనుమతులను వేగంగా ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, ఆగస్టు,29 (అక్షర కలం) ప్రతినిధి :**


శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ మరియు టి.జి.ఐపాస్ కమిటీ"సమావేశంలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు తదితర అంశాల పై సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సకాలంలో అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ చెప్పారు.ఈ సమావేశంలో పథకం కింద 101 వాహనాలకు రాయితీ మంజూరు చేయడం జరిగిందిని, జిల్లాలోని పరిశ్రమలు ముఖ్యంగా రైసుమిల్లులు భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ సీతారాం నాయక్, విద్యుత్ శాఖ ఏ. డి. ఈ అశోక్, జిల్లా టౌన్ కంట్రి ప్లానింగ్ అధికారి మాధవి, ఫాక్టరీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, ఈ.డి. ఎస్సి కార్పొరేషన్ ఎల్. శ్రీనివాస్, తదితర అధికారులు హాజరయ్యారు.

# ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి..

## ఐటీడీఏ పిఓ బి రాహుల్

**అక్షర కలం /భద్రాచలం ప్రతినిధి**

వాతావరణం మార్పు వలన గ్రామాలలో వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున హెచ్ఎం, ఉపాధ్యాయులు మరియు వార్డెన్ సమన్వయంతో ఉండి ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి మెనూ ప్రకారం పౌష్టికారమైన ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం నాడు బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను మరియు వడ్డుగూడెంలోని జిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉప్పుసాకా ఆశ్రమ పాఠశాలను సందర్శించి డార్మెటరీ, డైనింగ్ హాల్, వంటగది, సిక్ రూమ్ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పనిచేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎటువంటి విభేదాలు పెట్టుకోకుండా అందరూ కలిసికట్టుగా ఉండి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార అందించాలని, స్టోర్ రూమ్ లో నాసిరకమైన ఆహార పదార్థాలు డేట్ అయిపోయినవి ఉంటే వెంటనే తీసివేయాలని, జిసిసి నుంచి సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలని అన్నారు. అనంతరం సిక్ రూములో వైద్య సేవలు తీసుకుంటున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకొని, పిల్లలు అనారోగ్య బారిన పడినప్పుడు మెడికల్ క్యాంపులు నిర్వహించారా లేదా అని హెచ్ ఎం ని అడిగి తెలుసుకుని, పిల్లలకు రెండు మూడు రోజులు మించి జ్వరంగా ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్సీకి తీసుకొని పోయి వైద్య పరీక్షలు చేయించి పిల్లల తల్లిదండ్రులకు మరియు డిడి ట్రైబల్ వెల్ఫేర్ ,ఏ టి డి ఓ దృష్టికి విషయం తెలియజేయాలని అన్నారు. అనంతరం సిక్ రూమ్ లోని మందులను పరిశీలించి ఓ ఆర్ ఎస్ పాకెట్లు ఎక్స్పైరీ డేట్ ఈనెలాఖరు వరకే ఉందని కొత్త స్టాకు తీసుకోలేదా అని ఏఎన్ఎంని అడిగి తెలుసుకుని డేట్ అయిపోయిన మందులు ఉంటే వెంటనే తీయించి వేయాలని అన్నారు. అనంతరం డిఎంహెచ్వో కు ఫోన్ కాల్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ ఉప్పుసాక పాఠశాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపుల వివరాలు, పిల్లల యొక్క ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన డాటా తనకు అందజేయాలని, సరిపడా మందులు ఈ పాఠశాలకు సరఫరా చేసి మెడికల్ క్యాంపులు మరలా నిర్వహించాలని ఆదేశించారు. వంట చేసే సిబ్బంది పరిశు భ్రతను పాటించి వంటగదిని వంట సామాగ్రిని ఎప్పుడు శు భ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల ఆరుబయట రాత్రిపూట పిల్లలు ఎవరు? రాకుండా చూడాలని, వర్షాకాలంలో విషపూరితమైన క్రిమి కీటకాలు పాములు తేళ్లు సంచరించే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం కు ఆదేశించారు. అనంతరం ప్రైమరీ పాఠశాలలోని ఉద్దీపకం వర్క్ బుక్ రెండు నిర్వహణ తీరును పరిశీలించారు. ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన ప్రతి అంశం విద్యార్థులకు తెలియజేసే విధంగా బోర్డుపై వ్రాయించాలని అన్నారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఒక్కొక్క విద్యార్థినీ లేపి ఉద్దీపకం నకు సంబంధించిన పదాలను బోర్డుపై వ్రాయించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల మరమ్మత్తుల కొరకు నిధులు విడుదలయ్యాయనీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వాష్ రూమ్, టాప్స్, టాయిలెట్స్ ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని హెచ్ఎంకు సూచించారు. అనంతరం వడ్డేగూడెం జిపిఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్ రెండు చిన్నారులకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించి చిన్నారులను ఉద్దీపకములోని అంశాలు ఏ విధంగా చదువుతున్నది చూసి పిల్లలు ఉద్దీపకం లోని అంశాలు పదాలు చదవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉద్దీపకంలోని ప్రతి అంశం పదాలు ఉపాధ్యాయులు ముందుగా చదువుకొని ఆ తర్వాత పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉద్దీపకం వర్క్ బుక్ పిల్లలకు బోధన విషయంలో నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని, ఎస్ సి ఆర్ పి ప్రతిరోజు మీ పరిధిలోని పాఠశాలలను తప్పనిసరిగా పర్యవేక్షణ చేసి ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ పిల్లలకు ఏ విధంగా బోధిస్తున్నది పరిశీలించి దానికి సంబంధించిన ఫీడ్ బ్యాక్ తనకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక పాఠశాల హెచ్ఎం భీమ, వార్డెన్ శశికళ, ఎస్ సి ఆర్ పి మాధవి, వడ్డుగూడెం జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు బాలు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసిక మరియు శారీరక ఆరోగ్యం.. జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు

**సూర్యాపేట,ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం వారి ఆదేశానుసారం సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు, హాకీ మాంత్రికుడు మరియు హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరైన మేజర్ ధ్యాన్ చంద్ గారి జన్మదిన వేడుకలు తేది: 29-08-2025 న ఉదయం 11:30 నిమిషాలకు ఎస్.వి. డిగ్రీ కళాశాల, సూర్యాపేట వారి సంయుక్త ఆద్వర్యంలో కాలేజీ ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియం నందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మేజర్ ధ్యాన్ చంద్ గారి చిత్రపటానికి పుష్పాలంకరణలు చేసి %చీుణ% 2025 ప్రతిజ్ఞ ను చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్.వి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్, జిల్లా %ుచీ+ూ% సెక్రెటరీ దున్న శ్యామ్, గెజిటెడ్ ఆఫీసర్ సెక్రెటరీ డా. గోపి మరియు జిల్లా యువజన క్రీడల అధికారి జి. రాంచందర్ రావు మరియు డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు.

# వీధి కుక్కల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి ..... మున్సిపల్ కమిషనర్ మల్లేశం





**చండూరు, ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి :**

చండూరు: 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణపై అవగాహన కార్యక్రమంను శుక్రవారం నాడు చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యా సంస్థల యందు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులు మున్సిపల్ కమిషనర్ మల్లేశం, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కుక్క కాటు నుండి స్వీయ రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి దగ్గరగా నడుస్తూ భయపెట్టి రాళ్లు, కర్రలతో దాడి చేస్తే మీదకు కరవడానికి వస్తాయని, అదేవిధంగా చిన్న కుక్కపిల్లల దగ్గరకు వెళితే తల్లి కుక్క కరిచే ప్రమాదం ఉందని తెలిపారు. వీధి కుక్కల దాడులను నివారించడానికి విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, వాటిని రెచ్చగొట్టకూడదని తెలిపారు. వీధి కుక్కలకు దూరంగా ఉండాలని, వాటికి ఆహారం వేయకూడదని, అవసరమైతే సమీపంలో పెద్దలకు లేదా అధికారులకు తెలియజేయాలని తెలిపారు. కుక్క కరిస్తే వెంటనే సబ్బుతో గట్టిగా ఒత్తి కడిగి సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేయించుకోవాలని తెలిపారు. కుక్క కరిచిన 24 గంటల లోపు టీకాను వేయించుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు పెంపుడు కుక్కల గురించి అవగాహన లేకపోవడం వల్లే వాటి బారిన పడుతున్నారని, దీనిని నియంత్రించడానికి విద్యార్థులకు కూడా సరియైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగానే మీ గాంధీజీ పాఠశాలలో ఇట్టి అవగాహన కార్యక్రమంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం. అరవింద రెడ్డి, వార్డు ఆఫీసర్ పూర్ణచంద్రరావు, డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ భార్గవ్, బిల్ కలెక్టర్ మహేష్, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు బోరు బావుల తవ్వకానికి నిధులు మంజూరు



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం బురహాన్ పురంలో రెండు బోరు బావుల తవ్వకానికి నిధులు మంజూరు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలంశెట్టి వీరభద్రం విజ్ఞప్తి మేరకు 51వ డివిజన్ బురహాన్ పురంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో, దానికి సమీపాన ఉన్న మరోచోట రెండు బోరు బావుల తవ్వకానికి ఎంపీ రవిచంద్ర నిధులు మంజూరు చేసి శుక్రవారం పసుపు కుంకుమ,పూలుజల్లి పనులు ప్రారంభించారు. ఈ



సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలంశెట్టి వీరభద్రం,కార్పోరేటర్ శీలంశెట్టి రమ,ఆలేటి వెంకటప్పయ్య, లైన్ మెన్ శ్రీను, పలువురు స్థానిక మహిళా నాయకురాళ్లు కొబ్బరికాయలు కొట్టారు, ఎంపీ రవిచంద్రకు ధన్యవాదాలు చెప్పారు.

# భవనాన్ని వచ్చే సంవత్సరం జూన్ 2 నాటికి పూర్తి చేయాలి









**అక్షరకలం ప్రతినిధి**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. శుక్రవారం అయన పాత కలెక్టర్ కార్యాలయం వెనకవైపు నిర్మిస్తున్న నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, జిల్లా కలెక్టర్ ,అదనపు కలెక్టర్ల ఛాంబర్లు, మంత్రి ఛాంబర్, ఉండేలా ఏర్పాటు చేయాలని, పాత కలెక్టర్ కార్యాలయంలో పూర్తిగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను పాత కలెక్టర్ కార్యాలయాన్ని పూర్తిగా ఆధునీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కొత్త కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాల్ ను ఫాల్ సీలింగ్,ఎల్ ఈ డి స్క్రీన్లు, అన్ని సౌకర్యాలతో తో నిర్మించాలని చెప్పారు. కొత్త కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితులలో మార్చకూడదని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్ ను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ఇవ్వాలని, కార్యాలయ భవనం మొత్తాన్ని జూన్ 2 నాటికి పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు, నాణ్యత పై ప్రత్యేక దృష్టి నిలపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కోరారు. నల్గొండ కొత్త కలెక్టర్ కార్యాలయ నిర్మాణం ఆయా జిల్లాలలో ఉన్న సమీకృత జిల్లా అధికారుల కార్యాలభవనాల కన్నా బాగుండాలని అన్నారు. ఈ కార్యాలయం మొత్తం పూర్తి అయితే బయట ఉన్న డిఈఓ ,డిఎంహెచ్ఓ కార్యాలయాలను ఇక్కడికి తీసుకురావడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ దర్గా గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్ల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బి అధికారులతో సమీక్షించారు. రెండు గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు 5 కిలోమీటర్ల రోడ్డు పూర్తయిందని ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఘాట్ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్ అండ్ బి సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి , నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, కాంట్రాక్టర్ రామ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# గిడుగు రామ్మూర్తి పంతులు గారి జయంతి తెలుగు భాష దినోత్సవం...







**హైదరాబాద్,ఆగస్టు, 29 (అక్షర కలం )ప్రతినిధి :**

హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అకాడమీ మరియు పుడమి సాహితీ వేదిక సంయుక్తంగా నిర్వహించిన తెలుగు కీర్తి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ,కేంద్ర మాజీ మంత్రివర్యులు డా.సముద్రాల వేణుగోపాలాచారి,పుడమి సాహితీ వేదిక అధ్యక్షులు డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి.దత్తాత్రేయ గారు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు గారు అని కొనియాడారు.కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి గారు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం, తెలుగు సంస్కృతి గొప్పదని కొనియాడారు.డా.చిలుముల బాల్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో గొప్పదని, తెలుగు భాష కోసం గిడుగు రామ్మూర్తి పంతులు గారు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.మనవంతు బాధ్యతతో తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు.చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు,నృత్యాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి పంతులు పౌండేషన్ చైర్మన్ శ్రీమతి గిడుగు కాంతికృష్ణ,గిడుగు రామకృష్ణారావు,రొయ్యూరు శేషసాయి, శ్రీ భక్త రామదాసు 10వ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు,గుర్రం జాషువా 3వ తరం వారసులు బి.ఆర్.సుశీల్ కుమార్, కవయిత్రి మొల్ల 8వ తరం వారసులు డా.మున్నెల్లి శివశంకరయ్య,ప్రముఖ సామాజికవేత్త,బహుముఖ ప్రజ్ఞాశాలి డా.అజ్మత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట,ఆగస్టు 29 (అక్షర కలం ) ప్రతినిధి:**

శుక్రవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ సమావేశ మందిరంలో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 48 వార్డుల



నుండి 318 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, శుక్రవారం మంచి రోజు అయినందున ముగ్గులు పోసుకొని ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాలని,ఇందిరమ్మ ఇండ్లను 400 నుంచి 600 చదరపు అడుగులలో నిర్మించుకోవాలని, ముగ్గులు పోసిన తర్వాత ఫొటో క్యాప్చర్ చేస్తామని బేస్ మెంట్ పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్ గోడలు పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తి కాగానే 2 లక్షల రూపాయలు, ఇల్లు పూర్తి కాగానే లక్ష రూపాయలు ఇలా నాలుగు దశలలో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని రవాణా ఖర్చులు మాత్రం లబ్ధిదారులు తాపీ మేస్త్రీలు, సిమెంటు,ఇనుము లాంటి నిర్మాణసామాగ్రి ధరలు అదుపులో ఉంచేందుకు మున్సిపాలిటీ స్థాయిలో ధరల నియంత్రణకు ఆర్ డి ఓ స్థాయిలో ధరల మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని మేస్త్రీలతో,వ్యాపారస్తులతో మాట్లాడి ధరలను అదుపులో ఉంచేలా చూస్తారని అన్నారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వం నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి తక్కువ ఖర్చు తో నాణ్యతతో ఇండ్లు కట్టుకోవాలని కలెక్టర్ అన్నారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో 318 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు పత్రాలు ఈరోజు ఇస్తున్నామని, పేదవారికి ఇంకెవరికైనా ఇండ్లు రానివారు ఉంటే మరల దరఖాస్తు చేసుకోవాలని అర్హత ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవ్, హౌజింగ్ పిడి సిధార్థ, సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి, ఎస్ సి కార్పొరేషన్ ఈ డి శ్రీనివాస్ నాయక్,హౌసింగ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ అధికారులకు ప్రతిభ పురస్కారాలు..

పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం- 2024 మరియు నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను ఉత్తమ సేవ పతకం పొందిన వారిలో ఎం. అబ్దుల్ రహీమాన్ పి.సత్యనారాయణ వున్నారు.అదేవిధంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మరో నలుగురు పోలీసు అధికారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలు దక్కాయి..సేవాపతకం పొందిన వారిలో బి.వెంకటరమణారావు (ఏఎస్సై), జె.వెంకటేశ్వర్లు (ఏఎస్సై), ఎన్.వెంకట రెడ్డి (ఏఎస్సై), మహోన్నత సేవ పతకం సాధించిన సయ్యద్ హుస్సేన్ (హెడ్ కానిస్టేబుల్)వున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందజేసి అభినందించారు.

# సాయి సంతోషి జ్యూవెలరిలో బంగారం దొంగతనం కేసులో మరో నింధితుదిని అరెస్ట్ చేసిన సూర్యాపేట పోలీస్, వెస్ట్ బెంగాల్ లో ఆధుపులోకి తీసుకున్న పోలీసులు.

సూర్యాపేట,ఆగస్టు 29 (అక్షర కలం )

దర్యాప్తులో చాకచక్యంగా పని చేస్తున్న ప్రత్యేక బృందం, వెస్ట్ బెంగాల్ లో సమాచార వనరులు ఏర్పాటు చేసుకుని దొంగలను అరెస్ట్ చేసిన బృందం. ప్రధాన నిందితుడు %ూ%-5 జషిముద్దీన్ ను అరెస్ట్ చేసి సుమారు 25 లక్షల విలువగల 25 తులాల ఆభరణాలు, నగదు రూ.4,84,500/- స్వాదినం. ఈ కేసును జిల్లా పోలీస్ అతి ప్రతిష్టాత్మకంగా తీసుకుని దొంగలను అరెస్ట్ చేశాం, సహకారం లేని, తెలియన ప్రాంతంలో పోలీస్ టీమ్స్ కష్టపడి పని చేసినారు.జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు. సూర్యాపేట పట్టణం లో సాయి సంతోషి జువెలర్స్ నందు జరిగిన దొంగతనం కేసును సూర్యాపేట జిల్లా పోలీసు అతి ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇప్పటివరకు నలుగురు దొంగలను అరెస్ట్ చేయడం జరిగినది అని ఎస్పి నరసింహ గారు తెలిపినారు. మొదట అరెస్ట్ చేసిన %ూ%7 నిందితురాలు యశోద నుండి 14 తులాల బంగారం, 11 వటేదిన వెస్ట్ బెంగాల్ లో అరెస్ట్ చేసిన %ూ%4 నిందితుడు మాలిక్ మొల్ల నుండి సుమారు 55 లక్షల విలువైన 554 (అరకిలో) గ్రాముల బంగారం రూ.87 వేల నగదు, ఖమ్మంలో అరెస్ట్ చేసిన అమర్ బట్ నుండి రూ.5 వేల నగదు, ఇప్పుడు 26 వ తేదిన వెస్ట్ బెంగాల్ లో అరెస్ట్ చేసిన నిందితుడు %ూ%5 జషిముద్దిన్ నుండి 25 లక్షల విలువైన



25 తులాల బంగారం రూ.4.85 లక్షల నగదు రికవరీ చేశాము. ఈ కేసును అతి ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేశాము, సాంకేతిక ఆధారాలు, వనరులను సద్వినియోగం చేసుకుని ఢిల్లీ, గోవా, జార?ండ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో, నేపాల్ సరిహద్దుల్లో ప్రత్యేక బలగాలు నిఘా ఉంచి ఇప్పటి వరకు ఈకేసులో ముందుకు వెళ్ళాము. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పట్టణ %జ×% వెంకటయ్య, %జజూ% ఇన్స్పెక్టర్ శివ కుమార్ ల అధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మనకు సహకారం లేని, తెలియని ప్రాంతంలో కష్టపడి పని చేశారు. ఇదే దర్యాప్తు కొనసాగిస్తూ ఈ కేసులో మిగిలిన వారిని కూడా పట్టుబడి చేస్తాం అని ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు తెలిపినారు.కేసు వివరాలు: సూర్యాపేట పట్టణంలో జులై నెలలో 21వ తారీకు ఆదివారం రాత్రి బంగారం షాపులో బంగారం దొంగతనం జరిగింది 2.5 కేజీల బంగారం, డబ్బులు దొంగతనం జరిగినట్లు షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై సూర్యాపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ నందు నేరం సంఖ్య 266/2025 ప్రకారం దొంగతనం కేసు నమోదు చేసి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేయడం జరిగినది. దీనిలో భాగంగా జులై నెల 27వ తేదిన సూర్యాపేట పట్టణంలో అనుమానాస్పదంగా ఉన్న ఖమ్మం పట్టానికి చెందిన 30 సం.రాల %ూ%7 యశోద అనే మహిళను అరెస్టు చేసి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగినది.

# చెరువులను తలపించే రోడ్లు...

నాంపల్లి, ఆగస్టు 29( అక్షర కలం )

సిపిఎం నాంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యల సర్వే నాంపల్లి మండల కేంద్రంలో గాలింక అయోధ్య ఇంటి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్ల పరిస్థితి వర్షం వస్తే చెరువులను తలపించే విధంగా ఉన్నాయి అధికారులు స్పందించి ఈ సమస్యను త్వరితగతన పూర్తి చేయాలి కోరారు.



# ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్ష కిట్లు







- పేదల పక్షపాతిగా రాష్ట్రంలో ప్రజాపాలన
- కూసుమంచి క్యాంపు కార్యాలయంలో కాటమయ్య కిట్ల పంపిణీలో మంత్రి పొంగులేటి

అక్షర కలం/ కూసుమంచి:

కూసుమంచి : ప్రమాదాల నివారణ కోసం కాటమయ్య రక్షక కిట్లను గీత కార్మికులు తప్పనిసరిగా వినియోగించాలని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి 80 మంది లబ్ధిదారులకు శుక్రవారం కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... కల్లుగీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షక కిట్లను అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల, కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఈత చెట్లు ఎక్కే సమయంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సాంకేతికంగా, శాస్త్రీయంగా కాటమయ్య రక్షక కిట్లను తయారుచేయడం జరిగిందని అన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని అన్నారు. రైతులకు మద్దతుగా 21 వేల కోట్లతో 2 లక్షల వరకు పంట రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ, క్వింటా సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన రేషన్ కార్డు సమస్యలను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి 7 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. పేదలకు అండగా ఉండే మన ప్రభుత్వం మొదటి విడత నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు. రాబోయే రోజులలో ప్రతి ఒక్క అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గీత కార్మికుల సమస్యల తొలగించేందుకు ప్రభుత్వం భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, కూసుమంచి మండల తహసీల్దార్ రవి కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల గడువు పెంచాలి

నల్లగొండ ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి:



జాతీయ కుటుంబ ప్రయోజన పథకం యొక్క ప్రయోజనాలపై ప్రజలలో అవగాహన లేకపోవడం వల్ల అర్హులైన కుటుంబ సభ్యులు ఇచ్చిన గడువులలో దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని ప్రభుత్వం విధించిన గడువును పెంచాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ కోరారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన ప్రజలలో అవగాహన విస్తృతమైన ప్రచారం చేపట్టవలసి ఉండగా ఈ పథకంపై ఎలాంటి ప్రచారం చేయకపోవడం వల్ల ప్రజలు ఈ పథకానికి దూరం అవుతున్నారని పేర్కొన్నారు.ఈ పథకం కింద నల్లగొండ జిల్లాలో 3500 మందికి లబ్ధి చేకూర్చవచ్చని ప్రభుత్వం వద్ద లెక్కలు ఉన్నప్పటికీ చనిపోయిన కుటుంబ పెద్ద యొక్క డెత్ సర్టిఫికెట్ తీసుకోవడంలో కుటుంబ సభ్యులు పరిస్థితుల ప్రభావం వల్ల చొరవ చూపు లేకపోయారని పేర్కొన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ప్రధానంగా డెత్ సర్టిఫికెట్ అవసరం ఉన్నందున డెత్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే సర్టిఫికెట్ ఇవ్వాలని అధికారులను కోరారు అదేవిధంగా పథకం ద్వారా లబ్ధి పొందేందుకు మరోసారి గడువు పెంచాలని కోరారు.

# విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలి .. డీఈవో బిక్షపతి

చిట్యాల: అక్షర కలం (ప్రతినిధి)

చిట్యాల మండలంలోని ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి బొల్లారం



బిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ఉరుమడ్ల, ఎలికట్టే, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, హిందీ, సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో విద్యార్థుల యొక్క ప్రతిభను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పెంపొందించాలంటే విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. అనంతరం ఎలికట్టే గ్రామ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీ, సమయపాలన పట్టికను పరిశీలించి, ప్రతి విద్యార్థికి ఆంగ్ల భాషలో పట్టు సాధించే విధంగా కృషి చేయాలని, ప్రతి పాఠశాలలో సాయంత్రం అదనపు తరగతులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఉరుమడ్ల, ఎలికట్టే ప్రధానోపాధ్యాయులు, వెంకట్ రెడ్డి, నరసింహ, శేఖర్, తో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి.....



అక్షర కలం/ ప్రతినిధి :

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త శ్రీ కొండకింది చిన వెంకట్ రెడ్డి గారి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి."విద్య ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు" అన్న నమ్మకంతో విద్యా సంస్థలు నెలకొల్పి, లాభాపేక్ష లేని విద్యను అందించారు. విద్యావేత్తగా ఆయన చేసిన కృషి అపారమైనది అని వారి ఆశయాలు, స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగడం మా బాధ్యతగా భావిస్తున్నాను అని మంత్రి గారు అన్నారు.

# ఎంపీ వద్దిరాజు సింహాద్రిపురంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం నగరంలోని నాయుడుపేట సర్కిల్ సింహాద్రి పురంలో గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.విఘ్నేశ్వరుడికి ఎంపీ రవిచంద్ర పసుపు కుంకుమలు సమర్పించారు, మండపం నిర్వాహకులు ఆయన్ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.



# నిందితున్ని అరెస్టు చేసిన నల్లగొండ 1 టౌన్ పోలీస్: కె.శివరాం రెడ్డి డీఎస్పీ



నల్గొండ అక్షరకలం ప్రతినిధి

నల్లగొండ పట్టణంలో తేదీ 28.07.2025 ఉదయం 6 గంటల సమయంలో స్థానికుల సమాచారం మేరకు, ప్రతిక్ రెడ్డి జూనియర్ కాలేజ్ పక్కన ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద నిద్రిస్తున్న చింతకింది రమేష్ తండ్రి మల్లయ్య, వయసు 40,%=/శీ%. వడ్డేపల్లి, నాంపల్లి ను బండరాయితో తల పై మోది చంపిన విషయంలో రమేష్ బావ భూష్పాక వెంకటయ్య పిర్యాదు మేరకు నల్గొండ వన్ టౌన్ పోలీస్ వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది.నల్లగొండ జిల్లా గౌరవ ఎస్ పి శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారి ఆదేశానుసారం నల్గొండ డిఎస్పీ శ్రీ కె శివరాం రెడ్డి గారి ఆధ్వర్యంలో మూడు బృందాలుగా జరిగిన విషయంపై, నేరస్తుని గుర్తించుటకు నియమించడం జరిగింది. ఈ క్రమంలో టీమ్స్ సిబ్బంది సాయంతో నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ లభించిన సమాచారం మరియు ఆధారాలతో, చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లతో నేరస్తుడిని గుర్తించడం జరిగింది. ఈ క్రమంలో ఈరోజు ఉదయం 6 గంటలకు రెహమాన్ బాగ్ లోని ధమాకా బజార్ దగ్గర నిద్రిస్తున్న నిందితుని వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పట్టుబడి చేసి విచారించగా, నేరస్తుడు తాను చేసిన నేరం ఒప్పుకోవడం జరిగింది.

# బెస్ట్ యూనివర్సిటీతో ఎన్ జి కళాశాల..ఎంవోయు



నల్లగొండ ఆగస్టు 29 అక్షర కలం/ ప్రతినిధి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లాలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీతో నాగార్జున ప్రభుత్వ కళాశాల అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయు) కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రొ. వైస్ ఛాన్సలర్ డా. నాగజ్యోతి, నాగార్జున కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉపేందర్ ఒప్పందం మీద సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం 2030 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బెస్ట్ యూనివర్సిటీని సందర్శించే అవకాశం ఉందని, అలాగే బెస్ట్ యూనివర్సిటి విద్యార్థులు ఎన్ జి కళాశాలను సందర్శించే అవకాశం ఉందని అన్నారు. పరస్పర అతిథి ఉపన్యాసాలతోపాటు ప్రధానంగా పరిశోధనా రంగంలో ఇతోధిక సహకారం ఉంటుందని తెలి పారు. డా. మునిస్వామి (అర్థశాస్త్రం), డా. జ్యోత్స్న (జంతుశాస్త్రం), డా. ఎం. అనిల్ కు మార్, డా. బొజ్జ అనిల్ కుమార్ (రసాయన శాస్త్రం), డా. వై.వి.ఆర్. ప్రసన్నకుమార్ (ఆంగ్లం) లకు యూనివర్సిటీ ద్వారా పిహెచ్. డి. గైడ్ షిప్ లభించిందని అన్నారు. రానున్న అయిదు సంవత్సరాల్లో మరికొంత మందికి గైడ్ షిప్ లభించే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా అటు విద్యార్థుల్లో, ఇటు అధ్యాపకుల్లో పరిశోధనా విలువలు పెరుగుతాయని అన్నారు.

# ఎన్జీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం.

నల్లగొండ, ఆగస్టు 29 అక్షర కలం/ ప్రతినిధి :

మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జాతీయ క్రీడా



దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా, సముద్రాల ఉపేందర్ గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ %-% మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ క్రీడకు ప్రతిష్ఠాత్మక స్థానాన్ని తీసుకొచ్చిన మహానుభావుడు. ఆయనను స్మరించుకోవడం క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ మరియు జట్టు భావనను మనలో నాటుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన బోధ నేతల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు



# ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





నల్లగొండ, ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి :

శుక్రవారం సూర్యాపేటలోని గిరి నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల లను ఆకస్మికంగా



తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఓ పి సేవలు ఎన్ని? మలేరియా, డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్ కిట్ లు ఎన్ని ఉన్నాయి?,సీజనల్ వ్యాధులకు సంబందించి డెంగ్యూ, మలేరియా కేసులు ఏమైనా నమోదు అయినయా? అడిగి తెలుసు కున్నారు. ఏ యన్ సి రిజిస్టర్, ఫార్మసి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు.అక్కడే ఉన్న ఆశా వర్కర్లని జ్వరం సర్వే చేస్తున్నారా?, డెలివరీలు చేసేటప్పుడు జిజిహెచ్ నందు ఏమైనా సమస్యలు ఏర్పడుతున్నాయా?. ప్రభత్వ హాస్పిటల్ లో ఎన్ని సాధారణ డెలివరీలు అయినాయి?అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా ఏడవ తరగతిని సందర్శించి వారి మ్యాథ్స్ నోట్ బుక్ ను పరిశీలించారు. అలాగే ప్రతి ఒక్కరిచే ఇంగ్లీష్ చదివించారు. ఏ సబ్జెక్ట్ అయినా అర్థం కాకపోతే టీచర్లను అడగాలని అదేవిధంగా ఒకటికి పది సార్లు ప్రాక్టీస్ చేస్తే ఎక్కువ రోజులు గుర్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా?, టీచర్లు మంచిగా అర్థం అయ్యేలా చెప్తున్నారా?. అని అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం ఎక్కువ నమోదయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులతో



మాట్లాడాలని హెడ్ మాస్టర్ ని ఆదేశించారు. తహసిల్దార్ కృష్ణయ్య,మెడికల్ అధికారి శ్యామ్, ప్రధాన ఉపాధ్యాయులు యతిపతిరావు, ఉపాధ్యాయులు నరసింహారావు, స్టాఫ్ నర్స్ నాగమణి, ల్యాబ్ టెక్నిషియన్ సుష్మ, ఏ యన్ ఎం అరుణ, ఆశా వర్కర్స్ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



చిట్యాల: అక్షర కలం (ప్రతినిధి)

జాతీయ భారత ప్రముఖ హాకీ క్రీడాకారుని ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం రోజున నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారతదేశానికి హాకీ క్రీడలో తను చేసిన సేవలకు గుర్తుగా అతని జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా భారత ప్రభుత్వం 2012 నుండి జరుగుతుందని అన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ కీర్తిని చాటి చెప్పాడని , ఆటల వల్ల వినోదంతో పాటు శారీరక మానసిక రుగ్మతలను దగ్గరికి రాకుండా ఉంటాయని అన్నారు. విద్యార్థులకు క్రీడల వల్ల ఉన్నత ఉద్యోగాలు కూడా సంపాదించుకోవచ్చు అని, విద్యతోపాటు క్రీడలు కూడా ప్రతి విద్యార్థికి అవసరమని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో పోల గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకున్నారు.

# రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట,ఆగస్టు 29 (అక్షర కలం) ప్రతినిధి:

శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లోరాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ ఓటరు జాబితా తయారి, ప్రచురుణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 28వ తేది న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ ల లో ప్రచురించడం జరిగిందని, జిల్లాలో 486 గ్రామ పంచాయతీ ల లో మొత్తం 6,94,819 మంది ఓటర్లు ఉన్నారని,4388 వార్డులు ఉన్నాయని, 4403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 30 న మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని,ఆగస్టు 30 సాయంత్రం లోపు ఓటరు జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఎంపిడిఓ లకి తెలియజేయాలని అక్కడికక్కడే సవరించి సెప్టెంబర్ 2 న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 2 న తుది ఓటరు జాబితాను వార్డుల ప్రకారం పబ్లిష్ చేయటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒక ఓటరుకు రెండు చోట్ల ఓటుకు ఆస్కారం లేదని , ఒక్క చోట మాత్రమే నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల వివరాలను కుటుంబ సభ్యుల ఆమోదం తీసుకొని తదుపరి తొలగిస్తామని తెలిపారు. ఈ సమావేశం లో జెడ్పి సీఈవో వి వి అప్పారావు, డిపిఓ యాదగిరి,డిఎల్పిఓ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి కొప్పుల వేణారెడ్డి,రాజేశ్వరరావు, ఆజాద్,బిజెపి పార్టీ నుండి హబీద్, క్రాంతి,సిపిఐ ఎం నుండి కోట గోపి,బి ఆర్ ఎస్ నుండి బడుగుల లింగయ్య యాదవ్,నిమ్మల శ్రీనివాస్ గౌడ్,సత్యనారాయణ, వెంకటేశ్వర్లు,వై ఎస్ ఆర్ సి పి నుండి రమేష్, సి పి ఐ నుండి వెంకటేశ్వర్లు,సి పి ఐ ఎం ఎల్ నుండి న్యూ డెమోక్రసి డేవిడ్ కుమార్, ఎలక్షన్ డి టీ వేణు అధికారులు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు

## ముందస్తు సమావేశం నిర్వహించిన శాసన పరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి.

హైదరాబాద్,ఆగస్టు,29 (అక్షర కలం) ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ గారు మరియు లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు..హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్)- శివలింగయ్య.హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ- రవి గుప్తా, రాష్ట్ర డాక్టర్ జితేందర్, , ఆర్డర్ మహేష్ భగవత్, అడిషనల్ (లా ఆర్డర్)- విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్,రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్- కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి.. ఈసందర్భంగా ఎక్సటెన్షన్ పొందిన చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు గారికి శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్ గార్లు.తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ " గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు.గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి.గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందిం



చాలి..శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబా టులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలి.వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని రూట్లలో రోడ్లు దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని గౌరవ సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విదంగా సహకరించాలి.సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయి.తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలి. అవసరమైన నోడల్ అధికారులను , లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలి.పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలి.తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్ధవంతమైనది, మంచి పేరు ఉన్నది. మీ ఆద్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగే విదంగా సహకరించాలని కోరారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955